

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక


## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.


సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 268 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 4 ఫిబ్రవరి 2026 | వెల : 4/-


# పదవికో రేటు!



- కౌన్సిలర్‌కు రూ.అర కోటి, ఛైర్ పర్సన్‌కు రూ.5 కోట్లు!
- ఛైర్‌పర్సన్‌కో రేటు – కౌన్సిలర్‌కు మరో రేటు
- ధన బలమున్నోళ్లకే బీ–ఫారం
- ఖర్చు పెట్టే స్తోమత ఉన్న వారికే బీ–ఫారం
- ఛైర్‌పర్సన్‌కో రేటు, కౌన్సిలర్‌కు మరో రేటు
- పుర ఎన్నికల్లో జోరుగా ధన సమీకరణాలు
- ఆయా జిల్లాలోని పరిస్థితులు ఇలా!

హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ విన్నా మున్సిపల్ ఎన్నికల పేరే వినిపిస్తుంది. ఈ నేపథ్యంలో రాజకీయ ధన సమీకరణాలు జోరుగా సాగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 7 నగరపాలక, 116 పురపాలిక సంఘాలకు ఈ నెల 11న పోలింగ్ జరగనుంది. రాజకీయ అనుభవం, వరుసగా గెలుపొం దిన చరిత్ర, సామాజిక వర్గాల మద్దతు ఇవేవీ అభ్యర్థుల ఎంపికకు కొల మానం కావడం లేదు. ఆయా పార్టీల ముఖ్య నాయకులు, అధ్యక్షుడు కాసులున్న వారి వైపే మొగ్గు చూపుతున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులు బరిలో ఉండేందుకు అవకాశం ఇవ్వాలని ఆయా రాజకీయ నాయకుల వద్దకెళ్లి ఆరా తీస్తే, అక్కడ తెలిసిన విషయమేమిటంటే 'ఇవి చాలా ఖరీదుతో కూడుకున్న ఎన్నికలు. కార్యకర్తలు మొదలు ఓటర్ల వరకు ప్రతీది డబ్బుతో ముడిపడిన వ్యవహారం. మీ డివిజన్‌లో ప్రత్యర్థి పార్టీలు ఓటుకు గరిష్ఠంగా రూ.10 వేలు చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నారు. మీరు కూడా ఇందులో ఉండాలంటే రూ.అర కోటి, ఛైర్‌పర్సన్/ మేయర్ కావాలంటే రూ.5 కోట్లు సొంతంగా - మిగతా3లో



## ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం

- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్ వ్యాఖ్యలు
- ఆక్వా,టెక్స్‌టైల్స్ ఎగుమితిలో మనకు ఇబ్బందులున్నాయి
- వాణిజ్యం ఒప్పందం విషయాన్ని పార్లమెంట్‌లో చెప్పాలని చూశాం
- ఈలోపే ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషం చిమ్మారు.
- వాణిజ్య ఒప్పందంతో ఏ వర్గానికి నష్టం జరగదు.
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ఎన్డీయే ఎంపీలకు ప్రధాని ట్రేడ్ డీల్ అంశం.



## నరేంద్ర మోదీపై ట్రంప్ ఒత్తిడి ఉంది

- వాణిజ్య ఒప్పందంపై రాహుల్ గాంధీ
- వాణిజ్య ఒప్పందంపై అమెరికాతో రాజీపడ్డారన్న రాహుల్ గాంధీ
- నెలలుగా నిలిచిపోయిన ఒప్పందం అకస్మాత్తుగా ఎలా ఖరారైందని ప్రశ్న
- అంతా అయ్యాక ప్రతిష్ఠ మసకబారుతుందేమోనని మోదీ ఆందోళన చెందుతున్నారన్న రాహుల్



## నిబంధనలు పాటించాల్సిందే

- వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు
- భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలి
- భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదు
- దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా
- కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారు

## సుస్థిర ప్రగతికి దోహద పడేలా బడ్జెట్



- పీఎం ఆవాస్ కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- ఉచితాల కోసమే బడ్జెట్ అన్నట్లుగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపాటు
- 3 హైస్పీడ్ రైల్ కారిడార్లు రాబోతున్నాయని వెల్లడి
- ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్–2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది

హైదరాబాద్

ప్రజలు ఆశిస్తున్న సుస్థిర ప్రగతికి దోహద పడేలా కేంద్ర బడ్జెట్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కోసం కాకుండా వికసిత్ భారత్–2047 కోసం పెట్టిన బడ్జెట్ ఇది అని ఆయన వివరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమా వేశంలో బడ్జెట్ సహా పలు అంశాలపై ఆయన మాట్లాడారు. ఉచితాలు ప్రవేశ పెట్టడం కోసమే బడ్జెట్ అన్నట్లుగా - మిగతా3లో



## ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం...

- భారత రక్షణ రంగంలో కీలక ముందడుగు
- ఎస్ఎఫ్‌డీఆర్ టెక్నాలజీని విజయవంతంగా పరీక్షించిన డీఆర్‌డీవో
- ఒడిశాలోని చాందీపూర్ తీరంలో జరిగిన ప్రయోగం
- సుదూర గగనతల క్షిపణుల అభివృద్ధికి మార్గం సుగమం
- ఈ టెక్నాలజీతో భారత్‌కు పెరగనున్న వ్యూహాత్మక బలం

## మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



- మున్సిపల్ ఎన్నికలు, రాజకీయ పరిణామాలపై చర్చ
- జూబ్లీహిల్స్ క్యాంపు కార్యాలయంలో మంత్రులతో సీఎం భేటీ
- పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో రాజకీయ పరిణామాలపై చర్చ
- మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల రాజకీయ పరిణామాలపై చర్చ

### కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు

## మార్గం సుగమం

- కేబినెట్ నిర్ణయం ఉంటే చాలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై సుప్రీంకోర్టు క్లారిటీ
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో స్పష్టత ఇచ్చిన సుప్రీంకోర్టు
- ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పిన సుప్రీంకోర్టు
- కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చన్న సుప్రీంకోర్టు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాల అంశం గత కొంతకాలంగా రాజకీయంగా, న్యాయపరంగా తీవ్ర చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఎమ్మెల్సీల ఎంపికకు అడ్డంకిగా తమ ఉత్తర్వులు లేవని తేల్చి చెప్పింది. గత సంవత్సరం ఆగస్టు 13 నాటి మధ్యంతర ఉత్తర్వుల్లోనే స్పష్టంగా చెప్పామని జస్టిస్ విక్రంనాథ్ ధర్మాసనం తెలిపింది. కేబినెట్ నిర్ణయానికి అనుగుణంగా గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చని స్పష్టం చేసింది. తమ ఎన్నికపై జారీ చేసిన ఉత్తర్వులు - మిగతా3లో



## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

- బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు వేటు వేసిన ఇన్చార్జి స్పీకర్
- ఛైర్ వైపు కాగితాలు విసిరి, సభకు అంతరాయం కలిగించారని ఆగ్రహం
- చైనా సరిహద్దు వివాదంపై చర్చకు పట్టుబట్టిన రాహుల్ గాంధీ
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తక ప్రస్తావనపై సభలో వాగ్వాదం

# ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం

**న్యూఢిల్లీ :** అమెరికాతో ట్రేడ్ డీల్‌పై కేంద్రం ప్రకటన చేసింది. అమెరికాతో చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరిందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ ట్రేడ్‌డీల్‌తో భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం. ఆక్వా,టెక్స్‌టైల్స్ ఎగుమతిలో మనకు ఇబ్బందులున్నాయి. వాణిజ్యం ఒప్పందం విషయాన్ని పార్లమెంట్‌లో చెప్పాలని చూశాం. ఈలోపే ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విషం చిమ్మారు.

వాణిజ్య ఒప్పందంతో ఏ వర్గానికి నష్టం జరగదు. బలహీనవర్గాల ప్రజలకు మేలు జరగడం రాహుల్‌కు ఇష్టం లేదు. ట్రేడ్ డీల్‌తో లక్షలమంది ఉపాధి అవకాశాలు పెరుగుతాయి' అని స్పష్టం చేశారు.

అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోదీ ఎన్డీయే ఎంపీలకు వివరించారు. ఈ ఒప్పందం ద్వైపాక్షిక సంబంధాలకు మైలురాయి అని, సవాళ్లను అధిగమించి సాధించామని మోదీ తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ విజయాలను ప్రజలకు చేరవేయాలని ఎంపీలకు ప్రధాని సూచించారు. అమెరికా సుంకాలు తగ్గిస్తుందని, భారత్ కూడా తమ వస్తువులపై సున్నాకు తగ్గిస్తుందని ఒప్పందానికి అంగీకరించినట్టు అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన సంగతి తెలిసిందే..ఎన్డీయే ఎంపీలతో జరిగిన అంతరంగిక సమావేశంలో అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం, పర్యవసానాల గురించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కూటమి ఎంపీలు చురుకుగా వ్యవహరించాలని, చర్చల్లో పాల్గొని, ప్రభుత్వ విజయాల గురించి ప్రజలకు నేరుగా తెలియ జేయాలని ప్రదాని విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. పార్లమెంటరీ భాగస్వామ్యం ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఎన్డీయే ఎంపీలంతా సభలో పూర్తి హాజరును కొనసాగించాలని, కీలక అంశాలపై చర్చలకు సహకరించాలని ఆయన కోరారు.'ఎంపీలు అందరూ సభలో ఉండాలి, చర్చలో పాల్గొనాలి' అని ఆయన అన్నట్టు సమావేశం గురించి తెలిసిన వర్గాలు పేర్కొన్నాయి. నియోజకవర్గ ప్రజలను కలుసుకుని, ఇటీవల సమర్పించిన కేంద్ర బడ్జెట్ ముఖ్య విజయాలను హైలైట్ చేయాలని ఆయన వారిని ఆదేశించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావిస్తూ.. ప్రధాని మోదీ దీనిని ద్వైపాక్షిక సంబంధాలకు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించిన ఒక మైలురాయిగా అభివర్ణించారు. చర్చల సమయంలో ఎదుర్కొన్న సవాళ్లను ఆయన బయటపెట్టారు. విమర్శకులు సందేహాలు వ్యక్తం చేశారని, కానీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లిందని మోదీ వివరించారు.'ప్రజలు విమర్శిస్తున్నప్పటికీ, మేము ధైర్యం కోల్పోలేదు.. మా సహనం ఫలించింది. ప్రపంచ క్రమం మారుతోందని నేను అప్పుడే చెప్పాను' అని వ్యాఖ్యానించారు. సోమవారం ప్రదాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడి మధ్య జరిగిన టెలిఫోన్ సంభాషణ అనంతరం వాణిజ్య ఒప్పందంపై ప్రకటన వెలువడింది. ఈ ఒప్పందం ప్రకారం, భారతీయ వస్తువులపై ప్రస్తుతం ఉన్న సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడానికి అమెరికా అంగీకరించింది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది."భారత ప్రధానమంత్రి మోదీతో ఉన్న స్నేహం, గౌరవంతో పాటు ఆయన అభ్యర్థన మేరకు తక్షణమే అమల్లోకి వచ్చేలా అమెరికా, భారతదేశంమధ్య ఒక వాణిజ్య ఒప్పందానికి మేము అంగీకరించాం.. దీని ప్రకారం పరస్పర సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి అమెరికా తగ్గిస్తుంది' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో తెలిపారు. అంతేకాదు, అమెరికా వస్తువులపై సుంకాలను సున్నాకు తగ్గించడానికి భారత్



కట్టుబడి ఉందని అన్నారు. ఇంధనం, సాంకేతికత, వ్యవసాయం, బొగ్గు, ఇతర రంగాలతో సహా 500 బిలియన్ డాలర్లకు పైగా విలువైన అమెరికా ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ చెప్పారు.

ఇక, ప్రధాని మోదీ సైతం గొప్ప మిత్రుడు ట్రంప్‌తో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని అన్నారు.సహనమే భారత్ ను గెలిపించిందన్న మోదీదేశాలతో వాణిజ్య చర్చలకు సంబంధించి ప్రభుత్వం స్థిరమైన వైఖరితో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అమెరికాతో చారిత్రాత్మక ట్రేడ్ డీల్ కుదిరిన సందర్భంగా ఎన్డీయే కూటమి సమావేశంలో మోదీ మాట్లాడారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించడంపై ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నట్లు తెలిపారు. సుంకాల విషయంలో తమ ప్రభుత్వాన్ని విమర్శలు చుట్టుముట్టాయని గుర్తుచేసుకున్నారు.అయితే, ప్రభుత్వం మాత్రం సహనంతో వేచి ఉందని, దాని ఫలితం ఈ రోజు అందరూ చూస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా కుదిరిన ట్రేడ్ డీల్ తో అనుకూల ఆర్థిక వాతావరణం నెలకొందన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనల వెనుక దాగివున్న అజెండాభారత్–అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. దేశ సార్వభౌమాధికారం, ప్రభుత్వ పారదర్శకత, రైతుల ప్రయోజనాలు, ఇంధన భద్రత వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం బదులుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటనలు చేయడంపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ ఒప్పందం వల్ల అమెరికాకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని వారు ఆరోపించారు.ఈ ఒప్పందంపై సంతోషించాల్సింది ఏమీ లేదని కాంగ్రెస్ ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ అన్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, "గతంలో 3–4 శాతంగా ఉన్న టారిఫ్‌ను ఇప్పుడు 18 శాతానికి తగ్గించామని సంబరపడటం ఆశ్చర్యంగా ఉంది. మన దేశానికి సంబంధించిన వాణిజ్య ఒప్పందాల గురించి ట్రంప్ చెప్పడమేంటి? మనం ఇంకా సార్వభౌమ దేశం కాదా? ఏ దేశం నుంచి చమురు కొనాలి, ఎవరితో వ్యాపారం చేయాలో అమెరికా నిర్ణయిస్తుందా? ప్రధాని బదులు ట్రంప్ నుంచి ఇలాంటి కీలక సమాచారం రావడం దేశానికి మంచి సంకేతం కాదు" అని ఆయన వ్యాఖ్యానించారు.అమెరికా తన ప్రయోజనాలు లేకుండా ఏ ఒప్పందమూ చేసుకోదని, దీని వెనుక కచ్చితంగా రహస్య ఎజెండా ఉందని సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రామ్ గోపాల్ యాదవ్ ఆరోపించారు. "అమెరికా చాలా తెలివైన వ్యాపారి. ఆయుధాల కొనుగోలు లేదా కొన్ని మార్గాల నుంచి చమురు కొనవద్దనే ఒత్తిడి వంటివి దీని వెనుక ఉండొచ్చు. వారు బహిరంగంగా ఒప్పుకోరు కానీ, కచ్చితంగా ఏదో దాగి ఉంది" అని ఆయన అన్నారు.మరో కాంగ్రెస్ ఎంపీ జేబీ మాథర్ మాట్లాడుతూ, "వాణిజ్య ఒప్పందం అయినా, మరో ప్రకటనైనా అన్నీ ట్రంపే చేస్తున్నారు. భారత్ అమెరికాకు లొంగిపోయిందా? ఈ ఒప్పందం చుట్టూ ఎన్నో అనుమానాలు అలుముకున్నాయి. వ్యవసాయ ఒప్పందాలు, రైతుల హక్కుల సంగతేంటి? రష్యా నుంచి కాకుండా వెనిజులా, అమెరికా నుంచి చమురు కొనాలనే ఒత్తిడి నిజమేనా? వీటన్నింటిపై స్పష్టత రావాలి. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున ప్రభుత్వం సభలో దీనిపై చర్చకు సిద్ధపడాలి" అని డిమాండ్ చేశారు.రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల సంబంధాలను దెబ్బతీసేలా అమెరికా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రామన్ సింగ్ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న రష్యా చమురును కాదని, ఎక్కువ ధరకు వెనిజులా నుంచి కొనాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత సోమవారం ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వస్తువులపై అమెరికా సుంకాలను 18 శాతానికి తగ్గించగా, అమెరికా ఉత్పత్తులపై భారత్ కొన్ని వాణిజ్య అడ్డంకులను సడలించింది. ఈ ఒప్పందంతో భారత ఎగుమతులకు ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వం చెబుతుండగా, దీనిపై పార్లమెంటులో పూర్తి వివరాలతో కూడిన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. దూరదృష్టితో కూడిన చర్యభారత్, అమెరికా మధ్య కుదిరిన కీలక వాణిజ్య ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఒక చారిత్రక మైలురాయి అని అభివర్ణిస్తూ, ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఆయన అభినందనలు తెలిపారు.ఈ ఒప్పందంలో భాగంగా సుంకాలను 18 శాతానికి తగ్గించడం ఒక దూరదృష్టితో కూడిన చర్య అని చంద్రబాబు కొనియాడారు. ఈ నిర్ణయం ప్రపంచంలోని రెండు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక శక్తిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోందని చంద్రబాబు ప్రశంసించారు. ఈ ఒప్పందం వల్ల దేశ ఎగుమతి సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని, తద్వారా యువతకు, రైతులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని యువత, రైతులకు కూడా ఇది ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రశంసించిన జేపీ భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశానికి గొప్ప శుభవార్త అని పేర్కొంటూ, ఈ విజయం సాధించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. క్లిష్టమైన అడ్డంకులు ఎదురైనప్పటికీ, ప్రధాని మోదీ ఎంతో సంయమనంతో వ్యవహరించి జాతీయ ప్రయోజనాలను కాపాడారని ఆయన ప్రశంసించారు.ఈ ఒప్పందంపై జేపీ స్పందిస్తూ, "తీవ్రమైన సవాళ్ల నడుమ జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహించడం, ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థతో స్నేహాన్ని కాపాడుకోవడం, అదే సమయంలో జాతీయ గౌరవాన్ని నిలబెట్టడం వంటి అంశాలలో ప్రధాని మోదీ ఒక మాస్టర్ క్లాస్ ప్రదర్శించారు" అని కొనియాడారు. భారత్, అమెరికా దేశాలు సహజ మిత్రపక్షాలని, ఈ వాణిజ్య ఒప్పందం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఒప్పందంతో వచ్చిన నూతనోత్సాహంతో దేశం సమ్మిళిత ఆర్థిక వృద్ధి, శ్రేయస్సు దిశగా మరింత పటిష్టంగా ముందుకు సాగవచ్చని జేపీ ఆకాంక్షించారు. ఇకపై ఒక దేశంగా మనమంతా అసంపూర్తిగా మిగిలిపోయిన ఎజెండాపై దృష్టి సారించి, అభివృద్ధి పథంలో పయనించాలని ఆయన పిలుపునిచ్చారు.

# నిబంధనలు పాటించాల్సిందే

**న్యూఢిల్లీ :** భారత రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని ప్రఖ్యాత సోషల్ మీడియా కంపెనీలు వాట్సాప్, మెటాలకు సుప్రీంకోర్టు హితవు పలికింది. భారత ప్రజల గోప్యతా (ప్రైవసీ) హక్కును కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాము రాజీపడేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. దేశంలోని కోట్లాది పేద, నిరక్షరాస్య ప్రజలకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని వాట్సాప్, మెటాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలీలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. పేద మహిళ, రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే నిరుపేద వ్యక్తి, ఎవరైనా తమిళం మాత్రమే మాట్లాడే వ్యక్తి లాంటి వాళ్లకు మీ ప్రైవసీ పాలసీలు అర్థమవుతాయా అని సోషల్ మీడియా కంపెనీలను సుప్రీంకోర్టు బెంచ్ నిలదీసింది. కొన్నిసార్లయితే తమలాంటి వ్యక్తులే ఆ పాలసీలను అర్థం చేసుకోలేక సతమతం అవుతుంటారని ధర్మాసనం పేర్కొంది. 2024 నవంబరు 18న వాట్సాప్ నిర్వాహక కంపెనీ మెటాపై రూ.213.14 కోట్ల జరిమానాను కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) విధించింది. వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే ప్రక్రియపైనా ఐదేళ్ల నిషేధాన్ని విధించింది. "వాడితే వాడండి, లేదంటే వదిలేయండి" అన్నట్టుగా వాట్సాప్ ప్రైవసీ పాలసీ ఉందని సీసీఐ వ్యాఖ్యానించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో వాట్సాప్, మెటా అప్పీల్ పిటిషన్లు దాఖలు చేశాయి. మంగళవారం వీటిపై విచారణ నిర్వహించే క్రమంలో సుప్రీంకోర్టు ధర్మాసనం తాజా వ్యాఖ్యలు చేసింది.భారత ప్రభుత్వ సంస్థ సీసీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, వాట్సాప్, మెటా కంపెనీల తరఫు న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, అఖిల్ సిబల్ వాదనలు వినిపించారు. నిలిపివేయండి (ఆప్ట్ ఔట్) అనే ప్రస్తావన తమ ప్రైవసీ పాలసీలో ఉందని, అలాంటప్పుడు యూజర్ల



సమాచారాన్ని తాము వాణిజ్య ప్రకటనల సంస్థలకు బదిలీ చేయడంపై అభ్యంతరం ఎందుకని వాట్సాప్ తరఫు న్యాయవాదులు వాదించారు. ఆప్ట్ ఔట్ లాంటి ఆప్షన్ల గురించి తమలాంటి వాళ్లకే సరిగ్గా తెలియదని, ఎక్కడో బిహార్‌లోని మారుమూల పల్లెల్లో ఉండే భారతీయులకు ఎలా తెలుస్తుందని సుప్రీంకోర్టు బెంచ్ ప్రశ్నించింది. ప్రైవసీ పాలసీ మాటున భారతీయ వాట్సాప్ యూజర్ల వ్యక్తిగత సమాచారాన్ని చోరీ చేస్తున్నారని మండిపడింది. ఇలా జరగకుండా అడ్డుకుంటామని ధర్మాసనం తేల్చి చెప్పింది.ఈక్రమంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ తన వ్యక్తిగత అనుభవం ఒకటి చెప్పారు. "కొంతమంది వాట్సాప్ యూజర్లు, డాక్టర్లతో వాట్సాప్‌లో ప్రైవేట్ ఛాటింగ్ చేశారట. ఆ వెంటనే వాళ్లకు మెడిసిన్స్‌కు సంబంధించియాడ్స్ కనిపించడం మొదలైందట. ఈ లెక్కన యూజర్ల సమాచారాన్ని, ఆసక్తులను కూడా డబ్బుగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు" అని సీజేఐ పేర్కొన్నారు. వాట్సాప్ తరఫు న్యాయవాదులు స్పందిస్తూ, అన్ని వాట్సాప్ మెసేజ్‌లు ఎండ్ టుఎండ్ ఎన్‌క్రిప్టెడ్‌గా ఉంటాయన్నారు. స్వయంగా వాట్సాప్ కంపెనీ కూడా వాటిని చూడలేదని స్పష్టం చేశారు.సీసీఐ తరఫు న్యాయవాది తుషార్ మెహతా జోక్యం చేసుకుంటూ, యూజర్ల సమాచారాన్ని అడ్వర్టయిజ్‌మెంట్ కంపెనీలకు షేర్ చేసే విషయంలో వాట్సాప్, మెటాలు దోపిడీదారు వైఖరితో అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. యూజర్ల నుంచి నిర్దిష్ట అనుమతిని పొందకుండానే వారి వ్యక్తిగత యాక్టివిటీలు, ఆసక్తుల సమాచారాన్ని సోషల్ మీడియా కంపెనీలు అమ్ముకోకుండా నిరోధించాలని తుషార్ మెహతా కోరారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం ప్రకారం సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రత కోసం నిర్దిష్ట మార్గదర్శకాలను ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విన్నవించారు.తుషార్ మెహతా వాదనతో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఏకీభవిస్తూ రాజ్యాంగాన్ని పాటించలేకపోతే, దేశం విడిచి వెళ్లిపోవాలని వాట్సాప్, మెటాలను హెచ్చరించారు. ఈ లిటిగేషన్‌లో భారత ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను కూడా ఒక పక్షంగా చేరుస్తున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియా యూజర్ల మెటా డేటా భద్రతపై తగిన సూచనలను తమకు సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖను సీజేఐ ఆదేశించారు.ఈ అంశంపై వాదనలు ముగిసే వరకు యూజర్లకు సంబంధించిన ఏ సమాచారాన్నీ మెటా కంపెనీకి ఇవ్వొద్దని వాట్సాప్‌కు సుప్రీంకోర్టు బెంచ్ ఆర్డర్ ఇచ్చింది. సోషల్ మీడియా కంపెనీల వాణిజ్య వ్యవహారాల వల్ల భారత పౌరుల ప్రాథమిక గోప్యతా హక్కుకు భంగం కలగరాదని తేల్చి చెప్పింది. డేటా షేరింగ్ పేరుతో భారత పౌరుల ప్రైవసీ హక్కుతో ఆటలు ఆడటం సరికాదని పేర్కొంది. అన్యాయంగా వాట్సాప్ యూజర్ల సమాచారాన్ని ఇతరులకు షేర్ చేసేందుకు టెక్ కంపెనీలకు అనుమతి ఇచ్చేది లేదని దేశ సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. టెక్ దిగ్గజ కంపెనీల ప్రైవసీ షరతులు, నిబంధనలకు చాలా తెలివిగా రూపకల్పన చేశారని మండిపడింది. ఈ అంశంపై మళ్లీ ఫిబ్రవరి 9న వాదనలు వింటామని, ఆ రోజునే మధ్యంతర ఆదేశాలను జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది.

## లోక్‌సభలో చైనా అంశంపై రచ్చ

### స్పీకర్ టేబుల్ ఎక్కిన కాంగ్రెస్ ఎంపీలు - వాయిదా

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో రోజు మంగళవారం లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చైనా సరిహద్దు వివాదాన్ని మరోసారి ప్రస్తావించడంతో సభలో ఒక్కసారిగా ఉద్రిక్తత ప్రారంభమయింది. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే రాసినట్లుగా చెబుతున్న ప్రచురించని పుస్తకంలోని అంశాలను రాహుల్ ప్రస్తావించడాన్ని బీజేపీ ఎంపీలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరగడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. కాంగ్రెస్ సభ్యులు స్పీకర్ ముందు ఉన్న టేబుల్ ఎక్కిన నిరసన వ్యక్తం చేశారు. రాహుల్ కు మాట్లాడే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆక్సాయ్ చిన్ ప్రాంతాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే 1962లో చైనాకు అప్పగించిందని.. కాంగ్రెస్ దేశానికి క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అంతకుముందు, ఉదయం జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఘన స్వాగతం లభించింది. అమెరికాతో కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం దేశానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొంటూ ఎన్డీయే ఎంపీలు ప్రధానిని ఘనంగా సత్కరించారు. డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా ప్రభుత్వం దిగుమతి సుంకాలను 18 శాతానికి తగ్గించడం మోదీ దౌత్య విజయం అని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చకు సంబంధించి లోక్‌సభలో మొత్తం 18 గంటల సమయాన్ని కేటాయించారు. ఈ చర్చ ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. అలాగే, కేంద్ర బడ్జెట్‌పై జరిగే చర్చకు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 11న తన వివరణ ఇవ్వనున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. మంగళవారం ఉదయం ప్రశ్నోత్తరాల సమయంలోనూ విపక్షాల నినాదాలతో సభ హోరెత్తింది. వివిధ అంశాలపై చర్చకు పట్టుబడుతూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభ సజావుగా సాగలేదు. అటు రాజ్యసభలోనూ వాణిజ్య ఒప్పందంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కాంగ్రెస్ పట్టుబట్టింది. అయితే, ప్రభుత్వం అన్ని వివరాలను సభ ముందు ఉంచుతుందని సభా పక్ష నేత జేపీ నడ్డా స్పష్టం చేశారు.

## ఎస్ఎఫ్‌డీఆర్ పరీక్ష విజయవంతం




భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మరో కీలక విజయాన్ని అందుకుంది. సాలిడ్ ఫ్యూయల్ డక్టెడ్ రామ్‌జెట్ (ఎస్ఎఫ్‌డీఆర్) టెక్నాలజీని ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రదర్శించింది. ఈ పరీక్షతో సుదూర గగనతల క్షిపణుల (ఎయిర్–టు–ఎయిర్ మిసైల్స్) తయారీలో భారత్ స్వయంసమృద్ధి దిశగా మరో ముందడుగు వేసినట్లయింది. మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ఈ పరీక్షను నిర్వహించారు. ముందుగా గ్రౌండ్ బూస్టర్ సాయంతో క్షిపణి వ్యవస్థను నిర్దేశిత వేగానికి చేర్చారు. ఆ తర్వాత, నాజిల్–లెస్ బూస్టర్, రామ్‌జెట్ మోటార్ వంటి అన్ని ఉప వ్యవస్థలు ప్రణాళిక ప్రకారం అత్యంత కచ్చితత్వంతో పనిచేశాయి. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఐటీఆర్‌లో ఏర్పాటు చేసిన ట్రాకింగ్ వ్యవస్థల ద్వారా నమోదు చేసి, ధృవీకరించారు. ఈ అత్యాధునిక టెక్నాలజీ విజయవంతం కావడంతో భారత్‌కు గగనతలంలో గణనీయమైన వ్యూహాత్మక ప్రయోజనం లభించనుంది. శత్రు విమానాలను చాలా దూరం నుంచే అడ్డుకునే సామర్థ్యం భారత వాయుసేనకు అందుబాటులోకి వస్తుంది. దీంతో ఈ పరిజ్ఞానం కలిగిన కొద్ది దేశాల సరసన భారత్ చేరింది. డీఆర్‌డీవోకు చెందిన డీఆర్‌డీఎల్, హెచ్ఈఎంఆర్ఎల్, ఆర్‌సీఐ వంటి ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ పరీక్షను నిర్వహించాయి. ఈ ప్రయోగం విజయవంతం కావడం పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తలను, సంబంధిత పరిశ్రమలను అభినందించారు. ఇది భారత రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

## లోక్‌సభలో తీవ్ర ఉద్రిక్తత...

## 8 మంది కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సభలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి, నిరసన పేరుతో కాగితాలను చింపి స్పీకర్ ఛైర్ వైపు విసిరారన్న కారణంతో 8 మంది కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పీకర్ ప్యానెల్ ఆఫ్ ఛైర్ పర్సన్స్ లో ఒకరైన దిలీప్ సైకియా (ప్యానెల్ స్పీకర్) ప్రకటించారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో అమరీందర్ సింగ్ రాజా వారింగ్, మాణికం ఠాగూర్, గురుజీత్ సింగ్ ఆజులా, హిబి ఈడెన్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ యాదవరావు పడోలే, ఎస్.వెంకటేశన్, డీన్ కురియకోస్ ఉన్నారు. "ప్రతిపక్షాలకు తమ గళం వినిపించే హక్కు ఉంది, కానీ నిరసన పేరుతో సభను పూర్తిగా స్తంభింపజేయడం, ప్రొసీడింగ్స్ జరగకుండా అడ్డుకోవడం పార్లమెంటరీ సంప్రదాయాలకు విరుద్ధం" అని దిలీప్ సైకియా వ్యాఖ్యానించారు. అంతకుముందు, సరిహద్దుల్లో చైనా ఆక్రమణల అంశంపై చర్చించాలంటూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే రాసిన పుస్తకానికి సంబంధించిన ఓ మ్యాగజైన్ కథనాన్ని రాహుల్ ప్రస్తావించారు. అయితే, ధృవీకరించని వార్తా కథనాలను సభలో చదవకూడదని ప్యానెల్ స్పీకర్ సైకియా అభ్యంతరం తెలపడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా రాహుల్ స్పందిస్తూ.. "మాట్లాడటానికి నాకు ఎవరి అనుమతి అవసరం లేదు. నేను ప్రతిపక్ష నాయకుడిని.. నాకు పర్మిషన్ అనే పదం వాడటం సరికాదు" అని మండిపడ్డారు. తూర్పు లడఖ్‌లో ఘర్షణల వల్ల భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారని, దీనిపై ప్రధాని స్పందన ఏమిటని రాహుల్ ప్రశ్నించారు. ఈ సమయంలోనే అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం జరిగింది. విపక్ష సభ్యులు వెల్ లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. గందరగోళం మధ్యే సస్పెన్షన్ తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం సభను మంగళవారానికి వాయిదా వేశారు. టీడీపీ ఎంపీ జి.ఎం. హరీశ్ బాలయోగి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, సభలో నిరసనల హోరు తగ్గకపోవడంతో ప్రసంగం కొనసాగలేదు.

## నరేంద్ర మోదీపై ట్రంప్ ఒత్తిడి ఉంది



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశాన్ని ట్రంప్‌కు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. వాణిజ్య ఒప్పందం విషయంలో అమెరికాతో రాజీపడ్డారని అన్నారు. ఆయన పార్లమెంటు వెలుపల మీడియాతో మాట్లాడుతూ, ట్రంప్ ఒత్తిడి కారణంగా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేశారని, అంతా అయ్యాక ఇప్పుడు తన ప్రతిష్ఠ మసకబారుతుందేమోనని మోదీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. కొన్ని నెలలుగా నిలిచిపోయిన వాణిజ్య ఒప్పందంపై నిన్న రాత్రి సంతకం చేశారని, అకస్మాత్తుగా ఇది ఎలా ఖరారైందని ఆయన ప్రశ్నించారు. ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉండటం వల్లే ఒప్పందం కుదిరిందని అన్నారు. ఎప్ స్టీన్ ఫైల్స్, అమెరికాలో వ్యాపారవేత్త అదానీపై కేసు వంటి వ్యవహారాలు దీనికి కారణమని ఆరోపించారు. ఎప్ స్టీన్ ఫైళ్లలో బయటికి రాని విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయని అన్నారు. రైతుల కష్టాన్ని, దేశాన్ని అమ్మేశారని మండిపడ్డారు. అంతకుముందు భారత ఆర్మీ మాజీ చీఫ్ నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలపై లోక్‌సభలో రెండో రోజూ గందరగోళం కొనసాగింది. ప్రభుత్వం తనను సభలో మాట్లాడనివ్వలేదని రాహుల్ ఆరోపించారు. చరిత్రలో మొదటిసారి రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడేందుకు ఒక ప్రతిపక్ష నేతకు అనుమతి ఇవ్వలేదని మండిపడ్డారు.

# కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు మార్గం సుగమం

-మొదటిపేజీ తరువాయి
ఎత్తివేయాలని అమిర్ అలీ సుప్రీంకోర్టులో వెకేట్ పిటిషన్ వేశారు. అమిర్ అలీ పిటిషన్‌ను దాసోజు శ్రవణ్ వేసిన ప్రధాన పిటిషన్‌తో జత చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణ ధర్మాసనం మార్చి 19కి వాయిదా వేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టతతో కోదండరాం, అజారుద్దీన్ నియామకాలకు ఉన్న ప్రధాన అడ్డంకి దాదాపుగా తొలగినట్టే రాజకీయ నేతలు భావిస్తున్నారు. కోర్టు ఉత్తర్వుల కారణంగా నియామకాలు నిలిచిపోయాయన్న వాదనకు ఇక చెల్లుబాటు ఉండదని రాజకీయ వర్గాలు అంటున్నాయి. కేబినెట్ నిర్ణయం మేరకు గవర్నర్ ముందడుగు వేస్తే, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందని అంటున్నారు.

**రాజకీయ ప్రభావాలు**

సుప్రీంకోర్టు స్పష్టత తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. అధికార పార్టీకే కాకుండా ప్రతిపక్షాలకు కూడా ఇది ఒక స్పష్టమైన సంకేతంగా మారింది. గవర్నర్ పాత్రపై జరుగుతున్న రాజకీయ విమర్శలకు కొంత మేరకు ముగింపు పలికినట్టేనని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో, రాజ్యాంగ సంస్థల మధ్య సమతౌల్యం ఎంత కీలకమో ఈ కేసు మరోసారి గుర్తు చేసింది.

**న్యాయవ్యవస్థ సందేశం**




సుప్రీంకోర్టు ఒక స్పష్టమైన సందేశం ఇచ్చింది. రాజ్యాంగ పరమైన అధికారాల వినియోగంలో అనవసరమైన సందేహాలకు చోటు లేదని, ప్రభుత్వ నిర్ణయాలను అడ్డుకునే ఉద్దేశం తమకు లేదని, ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగేందుకు మాత్రమే న్యాయవ్యవస్థ జోక్యం ఉంటుందని ధర్మాసనం చెప్పకనే చెప్పిందని చెప్పవచ్చు.
మొత్తానికి, తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ఎంపికపై నెలకొన్న అనిశ్చితికి సుప్రీంకోర్టు తీర్పు కొంతవరకు తెరదించింది. కేబినెట్ సిఫారసులే కీలకమన్న స్పష్టతతో, ఎమ్మెల్సీల నియామక ప్రక్రియ ఇక ముందుకు సాగనుంది. మార్చి 19న జరిగే తదుపరి విచారణ ఈ అంశానికి పూర్తి పరిష్కారం చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగ సంస్థల మధ్య సమన్వయం ఎంత అవసరమో ఈ పరిణామం మరోసారి రుజువు చేసింది.

# సుస్థిర ప్రగతికి దోహద పడేలా బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి
రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీబీ జీ రామ్ జీ పథకాన్ని నిర్వీర్యం చేశారంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. ఆ పథకానికి బడ్జెట్‌లో 9శాతం అధిక నిధులు కేటాయించారని చెప్పారు. వస్త్ర ఉత్పత్తి పరిశ్రమలకు ఈ బడ్జెట్ ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు.

**పీఎంఏవై కింద రాష్ట్రానికి 4.30లక్షల ఇళ్లు**

ప్రతి జిల్లాకు బాలికల వసతి గృహం రాబోతున్నట్లు కిషన్‌రెడ్డి చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30లక్షల ఇళ్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ రైల్వే హబ్ కాబోతుందని వివరించారు. మేడారం జాతరకు కేంద్రం 3.70 కోట్లు కేటాయించిందన్నారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్లే సింగరేణి భ్రష్టు పట్టిందని ఆరోపించారు. సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా కేసీఆర్ మార్చుకున్నారని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మార్చుకుందని కిషన్‌రెడ్డి విమర్శించారు. "సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. బడ్జెట్ అంటే ఉచితాలు ప్రవేశపెట్టడమే అనే విధంగా ఆలోచిస్తున్నారు. కానీ ఈ ఏడాది బడ్జెట్ ఎన్నికల కోసం కాకుండా దేశంలోని అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం, బావితరాల భవిష్యత్ కోసం, 2047లో భారతదేశం ఒక అభివృద్ధి చేసిన దేశంగా పరివర్తన చెందేందుకు వేస్తున్న మరో అడుగు ఈ సంవత్సరం బడ్జెట్. హైదరాబాద్‌కు రైల్వే ఉండటం వల్ల పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి"- కిషన్ రెడ్డి, కేంద్రమంత్రి

**హైదరాబాద్ రైల్వే హబ్ మారబోతోంది**

కాజీపేట రైలు మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు 70 శాతం పూర్తయ్యాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. కొమురవెల్లి, జోగులాంబ స్టేషన్లను త్వరలోనే ప్రారంభించబోతున్నట్లుగా చెప్పారు. ఇప్పటికే 5 వందే భారత్, రెండు అమృత్ భారత్ రైళ్లను కేంద్రం తెలంగాణకు ఇచ్చిందన్నారు. కవచ్ సాంకేతికత ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆ పనులు రాష్ట్రంలో వేగంగా జరుగుతున్నాయన్నారు. దేశంలోనే కవచ్ పనులు పూర్తిచేసుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. రైల్వే హబ్‌గా కూడా హైదరాబాద్ కాబోతుందన్నారు. గ్రామీణ, పట్టణ సంస్థలకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లుగా కిషన్ రెడ్డి వివరించారు. ఐటీ, డిజిటల్, హైస్పీడ్ రైలు కారిడార్ లాంటి పలు అంశాలకు పెద్దపీట వేయడం జరిగిందని కిషన్ రెడ్డి వివరించారు. 23 లక్షల ఎమ్ఎస్ఎమ్ఈలు తెలంగాణలో ఉన్నాయన్న ఆయన ఈ బడ్జెట్ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు ఎంతో మేలు చేస్తుందని వివరించారు. గ్లోబల్ బయో ఫార్మాహబ్‌గా హైదరాబాద్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ కోసం హైదరాబాద్‌కు నిధులు కేటాయిస్తామని వివరించారు. కర్ణాటక తర్వాత తెలంగాణ ఐటీ రంగంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్న ఆయన ఈ రంగంలో పన్నులు తీసుకురావడం ఎంతో మేలన్నారు.

**కాంగ్రెస్‌పై కిషన్ రెడ్డి విమర్శలు**

పార్లమెంటులో ఒక్క ఎంపీ ఉన్న కమ్యునిస్టులు మోదీని గద్దెదించుతారా అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ముందు కమ్యూనిస్టుల పార్టీలు కనుమరుగు కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. ఎస్ఐఆర్ దేశం అభివృద్ధి కోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులకు అర్థం కాకపోతే ఏం చేస్తామని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దగా వల్ల సింగరేణి భ్రష్టు పట్టిందన్నారు. సింగరేణిని కేసీఆర్ ప్రైవేటు కంపెనీగా మార్చుకున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రైవేటు లిమిటెడ్‌గా మార్చుకుందన్నారు.

# రెబల్స్...బుజ్జగింపులు

**అదిలాబాద్ :** ఆయా పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు బీ ఫారంలు అందజేసేందుకు ఈ నెల మూడవ తేదీ ఆఖరు కాగా, అభ్యర్థి నామినేషన్ విత్ డ్రా చేసుకునేందుకు మధ్యాహ్నం మూడు గంటల వరకే సమయం ఉండటంతో రెబల్స్ తో ఇబ్బందులు పడుతున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు మంచిర్యాల కార్పొరేషన్ తో పాటు లక్షెట్టిపేట మున్సిపాలిటీల కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లను వెల్లడించగా, బెల్లంపల్లి మున్సిపాలిటీతో పాటు చెన్నూర్, క్యాతనపల్లి మున్సిపాలిటీల అభ్యర్థులను ఆయా నియోజక వర్గ ఎంఎల్ఏలు ఇంత వరకు ప్రకటించలేదు. అలాగే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సైతం అభ్యర్థుల పేర్లు అన్నింటిలో పూర్తి స్థాయిలో ప్రకటించాల్సి ఉంది. అయితే పార్టీ బీ ఫారంలు సమర్పించిన అనంతరం ఎంత మంది పార్టీ నుంచి బరిలో ఉంటారు, ఎంత మంది విత్ డ్రా చేసుకుంటారో, ఇండిపెండెంట్లుగా బరిలో ఎందరు నిలుస్తారో తేలనుంది. అయితే అభ్యర్థులను విత్ డ్రా చేయించి తమకు మద్ధతు తెలుపాలని, ఇందు కోసం లక్షల్లో మంతనాలు జరుపుతున్నట్లు తెలిసింది. అయితే ఈ సారి బరిలో లేకుంటే తర్వాత తమకు అవకాశం రావడం కలేనని, ఏదీ ఏమైనా బరిలో నిలుచునుడే.., సామర్థ్యం పరీక్షించుకునేడే అనే ధోరణితో రెబల్స్ ఉన్నట్లు సమాచారం. ఏది ఏమైనా మధ్యవర్తిత్వం ఫలిస్తుందా..! విఫలమవుతుందా..! అనేది వేచి చూడాల్సిందే...జిల్లాలో 149 డివిజన్, వార్డులకు 1061 మంది అభ్యర్థులకు చెందిన 1177 నామినేషన్లు ఆమోదం పొందగా ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల నుంచి అధిక సంఖ్యలో ఆశాపడుతున్నట్లుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో 60 డివిజన్లకు కాంగ్రెస్ నుంచి 77 నామినేషన్ లు, బీఆర్ఎస్ నుంచి 98, బీజేపీ నుంచి 108, బెల్లంపల్లి మున్సిపాలిటీ లోని 34 వార్డులకు కాంగ్రెస్ నుంచి 123, బీఆర్ఎస్ నుంచి 81, బీజేపీ నుంచి 27, చెన్నూర్ మున్సిపాలిటీ లోని 18 వార్డులకు కాంగ్రెస్ నుంచి 56, బీఆర్ఎస్ నుంచి 36, బీజేపీ నుంచి 24, క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 22 వార్డులకు కాంగ్రెస్ నుంచి 88, బీఆర్ఎస్ నుంచి 53, బీజేపీ నుంచి 33, లక్షెట్టిపేట మున్సిపాలిటీ లోని 15 వార్డులకు కాంగ్రెస్ నుంచి 25, బీఆర్ఎస్ నుంచి 32, బీజేపీ నుంచి 25 నామినేషన్లు వచ్చాయి. ప్రతీ పార్టీ నుంచి డివిజన్ లు, వార్డులకంటే నామినేషన్లు అధికంగా ఉండటంతో ఎవరికి బీ ఫాం వస్తుంది, ఎంత మంది విత్ డ్రా అవుతారు, ఇండిపెండెంట్లుగా ఎంత మంది బరిలో నిలుస్తారోననే ఉత్కంఠ నెలకొంది.

**డబ్బులే సర్వే**



ప్రజాదరణ ఉన్న... గెలిసే సత్తా చూపిన... సరిపడ సొమ్ము ఉంటేనే బి ఫారం అనే ప్రచారం జిల్లాలో జోరుగా సాగుతోంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపాలిటీలలో ఎన్నికలవేళ రాజకీయ వాతావరణం హీటెక్కుతోంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి పోటీ చేయాలనుకున్న ఆశావాహులకు సర్వేభయం పట్టుకుంది. క్షేత్రస్థాయిలో ప్రజల మన్ననలు ఉన్నప్పటికీ సరిపడ నిధులు సమకూర్చ గల వారికే బి ఫారాలు దక్కుతాయని ప్రచారంతో ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీని అంటిపెట్టుకొని ప్రజా సమస్యలతో నిత్యం ప్రజల మధ్య ఉన్నప్పటికీ డబ్బులు లేకపోవడంతో అభ్యర్థులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో మేయర్, చైర్మన్ పదవులకు డిమాండ్ పెరిగింది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పదవి దక్కించుకోవాలంటే రూ 10 నుంచి 15 కోట్లు, ఇల్లందు, అశ్వరావుపేట మున్సిపల్ చైర్మన్ పదవులకు రూ.2 నుంచి 3 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉండాలంటూ ప్రధాన ప్రార్టీలు చెబుతున్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఉన్నత పదవులే కాకుండా కార్పొరేటర్, కౌన్సిలర్ టిక్కెట్ల కోసం అభ్యర్థులు పెద్ద మొత్తంలో డిపాజిట్లను చూపాల్సి వస్తోంది. ఒక్కొక్క డివిజన్ నుంచి పోటీ చేయాలంటే రూ 25 నుంచి 35 లక్షల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతలు స్పష్టం చేస్తున్నారు. డబ్బులు లేని కార్యకర్తలకు టిక్కెట్లు దక్కే అవకాశం లేదంటున్నారు. రాజకీయ సిద్ధాంతాలతో సంబంధం లేకున్నా ఆర్థిక స్తోమత చాలినంత ఉంటే వారికే పార్టీలు పెద్దపీట వేయటం మాజీ ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదు. ప్రధాన రాజకీయ పార్టీలు ప్రతి వార్డు, డివిజన్లో సర్వేలు నిర్వహించి గెలిచే అవకాశం ఉన్న అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఆర్థిక బలం ఉంటుందో వారికే టిక్కెట్లు కేటాయించే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రస్తుత మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ఎన్నికలు బహు ఖరీదుగా మారాయి. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 60 డివిజన్లలో 592 మంది అభ్యర్థులు 807 నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల పరిశీలనలో 215 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. 592 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

## పదవికో రేటు!

-మొదటిపేజీ తరువాయి
సమకూర్చుకొని బీ-ఫారం పట్టుకుని ప్రచారం చేసేందుకు వెళ్లు. అనుభవం, డబ్బుల్లేవు. ప్రజాబలం ఉంది అనే మాటలు వద్దు. సమయం కూడా లేదు. కాదు, కూడదంటే ఉపసంహరించుకో. నామినేటెడ్ పదవులు ఇస్తామం'టూ తేల్చి చెప్పేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది. స్థానికంగా ప్రజాబలం ఉన్నా, ఆర్థికంగా ఉంటేనే కొన్ని బల్దియాలు, కార్పొరేషన్లలో ఆశావహులకు ప్రధాన పార్టీలు బీ-ఫారంలు జారీ చేసేందుకు సిద్ధమయ్యాయి.

**నల్గొండలో పరిస్థితి ఇలా**

నల్గొండ నగరపాలక సంస్థ పరిధిలో ఓ డివిజన్‌లో ప్రధాన పార్టీకి చెందిన మేయర్ అభ్యర్థి రూ.5 కోట్ల వరకు గరిష్ఠంగా ఖర్చు చేసేందుకు ముందుకొచ్చారు. కోదాడలో మొత్తం 35 వార్డులున్నాయి. వార్డుకు రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.3.50 కోట్లు ఖర్చు చేయగలిగిన వారే ఛైర్‌పర్సన్ అభ్యర్థి అనడంతో నలుగురు ఆశావహులు ఒక్కొక్కరు రూ.3.5 కోట్లు జమ చేసుకుని సదరు నేతను మరోసారి కలిశారు. దీంతో ఎవరికి ఛైర్‌పర్సన్ పదవి ఇవ్వాలో తేల్చుకోలేని ఆ నేత ప్లేటు ఫిరాయించారు. ఆ ఖర్చులను తానే భరిస్తానని చెప్పి వారిని వెనక్కి పంపినట్లు తెలిసింది. చౌటుప్పల్ పురపాలిక పరిధిలో ఓ వార్డులో ఓ పార్టీ అధ్యక్షుడు బీఫారం కావాలని డిమాండ్ చేసే ఛైర్‌పర్సన్ అభ్యర్థులను రూ.3 కోట్లు జమ చేసుకుని కనపడాలని ముఖం మీదే చెప్పేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాల్లో పరిస్థితులు ఇలా :**

మెదక్ జిల్లాలోని ఓ నియోజకవర్గంలో 2 పురపాలికల్లో కౌన్సిలర్‌గా పోటీకి ప్రచారం, ఇతరత్రా ఖర్చులకు రూ.20 లక్షలు వెచ్చించగలమంటేనే పార్టీ బీ-ఫారం ఇస్తామని ఆ పార్టీ ముఖ్యనేతనే తేల్చి చెప్పారు. ఆ నియోజకవర్గంలో పుర ఛైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న అభ్యర్థితో రూ.5 కోట్లు డిపాజిట్ చేయించారు. కరీంనగర్ జిల్లాలోని ఓ నియోజకవర్గ మున్సిపల్లో రూ.10 లక్షల ఖర్చు చేయగల స్తోమత ఉన్నట్లు ఆధారాలు చూపిస్తేనే ఓ ప్రధాన పార్టీ టికెట్లు ఖరారు చేసింది. కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థల్లోని అత్యధిక డిమాండ్ ఉన్న 2 విజిజన్లలో మరో ప్రధాన పార్టీ రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలు ఖర్చు చేయగలిగిన అభ్యర్థులకే బీ-ఫాంలు జారీ చేస్తోంది.
నిజామాబాద్ నగరపాలికలో రూ.50 లక్షల వ్యయం చేయగల ఆశావహులకే టికెట్లు ఇస్తామని ఓ పార్టీ ప్రకటించింది. మరో 4 పురపాలికల్లో రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వ్యయం చేసే అభ్యర్థులకే బీ-ఫారంలు ఇస్తామని ఓ ప్రధాన పార్టీ నేతలు ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓ బల్దియా ఛైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న నాయకుడి నుంచి రూ.3 కోట్లు, మరో పురపాలికలో రూ.2 కోట్లు డిపాజిట్ చేయించి ఖర్చు చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. రెండు మున్సిపాలిటీల్లో ఓ పార్టీ టికెట్ ఇచ్చే వారి బ్యాంకు అకౌంట్లో రూ.25 లక్షల డబ్బు ఉంటేనే బీ-ఫారం జారీ చేసింది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నగరపాలికలో రూ.5 కోట్లు ఖర్చు చేసే వారికే మేయర్‌గా అవకాశం ఇస్తామని ప్రధాన పార్టీల్లోని కొంత మంది నేతలు చెబుతున్నారు. మహబూబ్‌నగర్ నగరపాలికలోనూ మేయర్ గిరి కోసం డబ్బులు సమకూర్చుకోవాలని ముఖ్య నేతలు సూచిస్తున్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో ఓ ప్రధాన పార్టీకి సంబంధించి నామినేషన్లు వేసిన ఆశావహ అభ్యర్థులు ఒక్కొక్కరు తమ ఖాతాల్లో రూ.10 లక్షలు జమ చేసి ఆ వివరాలు అందించాలని అక్కడి ముఖ్యనేత ఆదేశించారు. ఎన్నికల ప్రచారానికి పార్టీ నుంచి ఫండ్ ఏదీ ఇవ్వమని, ఎవరికి వారే ఖర్చులు పెట్టుకోవాలని సూచించారు. ఛైర్‌పర్సన్ పదవి కావాలంటే రూ.3 కోట్లు జమ చేయాలని చెప్పడంతో నో చెప్పలేక ఓ ఆశావహ అభ్యర్థి అంగీకరించారు.

## మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికలపై సీఎం రేవంత్ కొంతమంది మంత్రులతో తాజాగా సమావేశమయ్యారు. ఈరోజుతో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియతో పాటు బీ-ఫాం అందజేత కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇప్పటికే అభ్యర్థుల తరఫున జోరుగా కొనసాగుతున్న ప్రచారం మరింత విస్తృతం కానుంది. 116 మున్సిపాలిటీలకు, 7 కార్పొరేషన్‌లకు ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. వారం రోజులపాటు ప్రచారం నిర్వహించుకునేందుకు అవకాశం ఉండడంతో వ్యూహాలకు అధికార పార్టీ పదును పెడుతోంది.
అందులో భాగంగా ఇవాళ పార్లమెంట్ వారీగా ఇంఛార్జిలుగా వ్యవహరిస్తున్న మంత్రులు, సీనియర్ నేతలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ బలాబలాలు, ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షీ నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంఛార్జి మంత్రులు, సీనియర్ నాయకులు చర్చిస్తున్నారు.
పార్లమెంటు నియోజక వర్గాల వారీగా తాజా పరిస్థితులపై చర్చ ముగిసిన తరువాత ఆయా మున్సిపాలిటీలల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే మున్సిపాలిటీల వారీగా డీసీసీ అధ్యక్షుల నుంచి పీసీసీ నివేదికలు తెప్పించుకుంది. ఆ నివేదికల ఆధారంగా సమీక్ష నిర్వహిస్తున్నట్లు పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

## మెదక్‌లో గులాబీ ఆపరేషన్ ఆకర్ష్..



**మెదక్ :** మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్లో చేరికల జోష్ కనిపిస్తున్నది. హస్తం పార్టీ నాయకులు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారు. మళ్లీ అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ పథకాలు అమ లు కావాలన్నా కేసీఆర్ రావాలన్న అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. అందుకు తమ మద్దతు అవసరమని భావిస్తూ.. గులాబీ పార్టీలోకి వస్తున్నారు. మెదక్ జిల్లాలోని మె దక్, నర్సాపూర్, రామాయంపెట్, తూప్రాన్ మున్సిపాలిటీ ల నుంచి కాంగ్రెస్ పార్టీ నేత లు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో చేరుతున్నారమున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎన్నికలపై సీరియస్గా దృష్టి సా రించింది. ఇప్పటికే మెదక్ జిల్లా వ్యాప్తంగా వ్యూహాత్మకంగా ప్రణాళికలు రచిస్తోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు నేతృత్వంలో వరుసగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మ కంగా తీసుకుంది. గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే ప ద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ ఎన్నికల ఇం చార్జి, మాజీ ఎఢ్రీఇ ఫారూక్ హుస్సేన్ వరుస సమీక్షలతో కేడర్లో జోష్ నింపుతున్నారు. ఈ క్రమంలోనే పట్టణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ బీఆర్ఎస్ దూ కుడు ప్రదర్శిస్తోంది. మెదక్ జిల్లాలో నాలు గు మున్సిపాలిటీల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నిక ల్లో తమ మద్దతుదారులు మంచి ఫలితాలు సాధించారని, అదే ఊపును మున్సిపల్ ఎన్నికల్లోనూ కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు ధీమా వ్యక్తం చేశారు. పట్టణ ఓటర్లు ఎప్పుడూ అభివృద్ధిని కోరుకుంటారని తమవైపే ఉంటారని బీఆర్ఎస్ నేతలు చెబుతు న్నారు. కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగిందనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ప్రధానంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగట్టాలని నిర్ణయించుకుంది. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో పట్టణాల్లో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులకు ఖర్చు చేయలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. రేవంత్రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన మిషన్ భగీరథ, పలు పథకాల నిర్వహణను కాంగ్రెస్ గాలికొదిలేసిందని విమర్శిస్తున్నారు.

# పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె విజయవంతం చేయండి

**నాలుగు లేబర్ కోడ్,లు రద్దయ్యే వరకు పోరాడండి.. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు,సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ పిలుపు**




**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కాటేదాన్ పారిశ్రామిక ప్రాంతంలో పనిచేసే వేలాదిమంది కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొని నాలుగు లేబర్ కోడ్లు రద్దయేలా పోరాడాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్,లు పిలుపునిచ్చారు. మంగళవారం సీఐటీయూ కాటేదాన్ కార్యాలయం లో జరిగిన కార్మికుల సమావేశానికి వారు ఇరువురు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు రుద్రకుమార్ అధ్యక్షత వహించి నిర్వహించారు.ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ... పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని ఉద్యోగ భద్రత లేదని ఆయన వాపోయారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా పరిశ్రమ యాజమాన్యాలు కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించి మోసం చేస్తున్నదని ఆయన విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడులు తెచ్చి కార్మిక వర్గానికి సమ్మె చేసే హక్కు సంఘం పెట్టుకునే హక్కు,బీరసారాల హక్కు లేకుండా చేసిందని 29 కార్మిక చట్టాలను లేకుండా చేసిందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దయ్యే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని,అన్ని సంఘాల నాయకులు కార్మికులు ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో పాల్గొనాలని పర్వతాలు చంద్రమోహన్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కోశాధికారి కన్నెగారి నర్సింహ్మరెడ్డి ఏఐటీయూసీ నాయకులు జె.విజయానంద్ గౌడ్,ఆనంద్ గౌడ్,జి సత్యం వాణి కృష్ణ,సదనంద్ గౌడ్ రామచంద్రయ్య సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పిసికే భాస్కర్ బచ్చలకూర స్వామి బిసిడబ్ల్యు నాయకురాలు కవిత నరహరి రాములు నరేష్ ఇమ్రాన్ తిరుమలేష్ ప్రవీణ్,సచిన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రమ దోపిడిని పెంచుకునేందుకే లేబర్ కోడ్లు

**ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య**






**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** శ్రమ దోపిడిని పెంచుకునేందుకే బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్,లు తీసుకొచ్చారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ చౌరస్తాలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్ కోడ్,లను రద్దు చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య హాజరై వారు మాట్లాడుతూ. యజమానులు కార్మికుల దోపిడీకి లేబర్ కోడ్ సాధనాలుగా ఉపయోగపడే విధంగా మోడీ ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. కార్మిక చట్టాలను మార్చి వాటి స్థానంలో లేబర్ కోడ్,లను తీసుకురావడం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేయడమే అని అన్నారు.లేబర్ కోడ్,లు ఆర్థిక నేరగాలకు మరింత బలాన్ని చేకూర్చే విధంగా తయారు చేశారని అన్నారు.దీంతో దేశ అభివృద్ధికి,ప్రజల కొనుగోలు శక్తికి అవరోధంగా మారుతుందని అన్నారు.రాజకీయ నాయకులు,ప్రజాప్రతినిధులు వ్యాపారాలలోకి ప్రవేశించిన తర్వాత లేబర్ కోడ్ లాంటి చట్టాలను,కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలుగా రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించారని అన్నారు.లేబర్ కోడ్ లు కార్మికుల ఉద్యోగ భద్రతకు,జీతాల పెరుగుదలకు తీవ్ర ఆటంకంగా మారుతాయి అని అన్నారు.ఉద్యోగ భద్రత లేని లేబర్ కోడ్ లను రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదని అన్నారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.అనంతరం ఏఐటియుసి జిల్లా కార్యదర్శి జైపాల్ రెడ్డి,భవన నిర్మాణ కార్మిక సంఘ నాయకులు నర్రగిరిలు మాట్లాడుతూ. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు లేబర్ కోడ్ లు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తాయని అన్నారు.స్వతంత్ర పోరాటం ముందు పోరాటం అనంతరం సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేయడం అంటే స్వతంత్ర పోరాట వీరులను అవమానపరచడమే అని అన్నారు.సంఘటిత అసంఘటిత రంగాల కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు నర్రగిరి,వినయ్,యుగంధర్ రెడ్డి,జగన్ సురేష్ జాస్వ పెంటయ్య రమేష్ ఆనంద్,బాల్ రాజ్ నరేందర్ నరసింహ బాబు సత్యం మల్లేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# పరమేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలి







## ఔరాది రమేష్ ముదిరాజ్

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** పరమేశ్వరుని కరుణ,కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం భవానీకాలనీకి చెందిన ఔరాది రమేష్ ముదిరాజ్ అన్నారు.శివస్వాములు దీక్షలో భాగంగా పాదయాత్రగా నారాయణఖేడ్ జరాసంగం తుర్కవాడగామా నుంచి శ్రీశైలంకు సుమారు 300 మంది స్వాములు బయలుదేరారు.ఈ పాదయాత్ర బాలానగర్ లోని అమ్మపల్లి దేవాలయానికి చేరుకుంది.అక్కడ అమ్మవారిని,ఆ పరమేశ్వరుడిని స్వాములు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఔరాది రమేష్ ముదిరాజ్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శివ స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని తన సొంత నిధులతో ఏర్పాటు చేశారు.ఈ శివదీక్షను గురుస్వామి వెంకటరమణరెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్రగా ప్రతియేడు కొనసాగుతుందన్నారు. శివస్వాములు,భక్తులు సుమారు 400 కిలో మీటర్ల పాదయాత్రను పది రోజుల పాటు కొనసాగిస్తారని శ్రీశైలంలో స్వామిని దర్శించుకున్న అనంతరం పాదయాత్ర ముగుస్తుందన్నారు.ఈ పాదయాత్రలో శివ దీక్ష స్వాములు,భక్తులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ డెలివరీ గడువులోగా పూర్తి చేయాలి

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల :** సీఎంఆర్ (కస్టమ్ మిల్డ్ రైస్) డెలివరీ గడువులోగా పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని లక్ష్యాన్ని చేరుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు సీఎంఆర్ డెలివరీపై రైస్ మిల్లుల యజమానులతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఇంచార్జి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. 2024?25 ఖరీఫ్ సీజన్, 2024-25 రబీ సీజన్ కు మిల్లుల వారీగా వారికి కేటాయించిన ధాన్యం, డెలివరీ చేయకుండా పెండింగ్ లో ఉన్న ధాన్యం వివరాలపై సుదీర్ఘంగా చర్చించారు. రైస్ మిల్లుల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గడువులోగా పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మిల్లర్లు నిబంధనల ప్రకారం సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారుఖరీఫ్ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 16-02-2026 చివరి తేదీ అని, రబీ 2024-25 సీజన్ కు సంబంధించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించడానికి 28-02-2026 చివరి తేదీ అని వెల్లడించారు. జిల్లాకు కేటాయించిన సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం మిల్లర్లు బాధ్యతగా భావించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్ లో లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకునేలా ముందుచూపుతో వ్యవహరించాలని ఆదేశించారు సమావేశంలో ఇంచార్జి జిల్లా పౌర సరఫరాల అధికారి రాధాబాయి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## బంగారం భద్రతా సాధనమా?

భారతీయ సామాజిక ఆర్థిక వ్యవస్థలో బంగారం అనేది కేవలం విలువైన లోహం మాత్రమే కాదు, అది ఒక సాంస్కృతిక మూలధనం, సామాజిక ప్రతిష్ఠా సూచిక, ఆర్థిక భద్రతా సాధనంగా బలంగా స్థిరపడిపోయింది. ముఖ్యంగా వివాహాలు, పండుగలు, కుటుంబ పరంపరలు వంటి సందర్భాల్లో బంగారం వినియోగం ఒక అనివార్య ఆచారంలా మారింది. అయితే ఇటీవలి కాలంలో బంగారం ధరల్లో చోటుచేసుకుంటున్న అసాధారణ పెరుగుదల, వ్యక్తిగత కుటుంబాల స్థాయిని మించి, సమగ్ర జాతీయ ఆర్థిక వ్యవస్థపై కూడా దీర్ఘకాలిక ప్రతికూల ప్రభావాలను మోపుతోంది. మధ్య తరగతి జీవితంలో బంగారం ధరల పెరుగుదల ఒక రకమైన వినియోగ ఒత్తిడిను సృష్టిస్తోంది. స్థిర ఆదాయం ఉన్నప్పటికీ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆరోగ్య వ్యయాలు, విద్యా ఖర్చులు వంటి అంశాల మధ్య బంగారం కొనుగోలు అనేది ఒక ఆర్థిక విరోధాభాసంగా మారింది. బంగారం కొనాలనే సామాజిక అంచనాలు ఒకవైపు, కొనలేని ఆర్థిక వాస్తవాలు మరోవైపు ఉండడం వల్ల మధ్యతరగతి కుటుంబాలు తీవ్రమైన మానసిక, ఆర్థిక ఒత్తిడికి లోనవుతున్నాయి. బంగారం ధరల పెరుగుదల ప్రభావం అత్యంత తీవ్రంగా పడేది ఆడపిల్ల తల్లిదండ్రుల మీదనే. భారతీయ సమాజంలో ఇంకా పూర్తిగా నిర్మూలించబడని కట్న భావజాలం, సామాజిక పోటీ ధోరణి, పరువు ప్రతిష్ఠల పట్ల అతిగా ఆలోచించే మనస్తత్వం కలసి, ఒక ఆడపిల్ల తండ్రిని, తల్లిని ఒక సాంఘిక బాధ్యతా సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. కుమార్తె వివాహం అనగానే ఆభరణాలు, కట్నం, ఆడంబర ఖర్చులు అనే భావన తల్లిదండ్రుల మనసులో సహజంగానే కలుగుతోంది. ఈ భారం కోసం తల్లిదండ్రులు తమ జీవితకాలపు పొదుపును ఖర్చు చేయడమే కాకుండా, బ్యాంకు రుణాలు, ప్రైవేట్ అప్పులు, బంగారం తాకట్టు వంటి మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా వారు ఒక అప్పుల చట్రంలో చిక్కుకుని, వివాహం పూర్తయిన తర్వాత కూడా సంవత్సరాల తరబడి ఆర్థిక భారాన్ని మోస్తూ జీవించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. ఇది కేవలం ఆర్థిక సమస్య కాదు, ఇది తల్లిదండ్రుల మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్రమైన ప్రభావం చూపించే ఒక మానసిక ఒత్తిడి సంక్షోభంగా మారుతోంది. సంపన్న వర్గాల దృష్టిలో మాత్రం బంగారం ఒక హెడ్జింగ్ సాధనంగా పనిచేస్తోంది. ద్రవ్యోల్బణం, మార్కెట్ అస్థిరత, స్టాక్ మార్కెట్ పతనం వంటి పరిస్థితుల్లో బంగారం ఒక భద్రమైన పెట్టుబడిగా మారుతుంది. ధరలు పెరిగే కొద్దీ వారి సంపద విలువ కూడా పెరుగుతూ, ఇది ఒక సంపద విస్తరణ యంత్రాంగంగా పనిచేస్తోంది. దీని వల్ల సామాజిక, ఆర్థిక, అసమానతలు మరింత లోతుగా పెరుగుతున్నాయి. సమగ్ర ఆర్థిక వ్యవస్థ పరంగా చూస్తే, బంగారం ధరల పెరుగుదల దేశానికి తీవ్రమైన దిగుమతి భారాన్ని కలిగిస్తోంది. భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న బంగారం దిగుమతి దేశం కావడం వల్ల, ధరలు పెరిగినప్పుడు విదేశీ మారకద్రవ్య నిల్వలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది చెల్లింపుల సమతుల్యత లోటును పెంచి, రూపాయి విలువను బలహీనపరుస్తుంది. రూపాయి బలహీనపడిన కొద్దీ దిగుమతుల ఖర్చు మరింత పెరిగి, ద్రవ్యోల్బణం మరోసారి తీవ్రమవుతుంది. ఇది ఒక ఆర్థిక దుష్చక్రంగా మారుతుంది. ఇంకా ముఖ్యమైన అంశం ఏమిటంటే, బంగారంపై అధిక పెట్టుబడి పెట్టడం వల్ల దేశంలో ఉత్పాదక మూలధనం క్షీణిస్తోంది. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, స్టార్టప్‌లు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడి పెట్టాల్సిన డబ్బు బంగారం రూపంలో నిల్వ అయి, ఆర్థిక వృద్ధి రేటును దీర్ఘకాలంలో మందగించే ప్రమాదాన్ని కలిగిస్తోంది. ఇది దేశానికి ఒక అవుట్‌పుట్ గ్యాప్‌ను సృష్టిస్తోంది. ప్రభుత్వ వైఖరి విషయానికి వస్తే, బంగారం ధరలను నేరుగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, దిగుమతి సుంకాలు, జిఎస్టి, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి విధానాల ద్వారా ప్రజలను భౌతిక బంగారం కొనుగోలు నుంచి దూరం పెట్టే ప్రయత్నం చేస్తోంది. ఇది ఒక రకమైన విధానాత్మక హస్తక్షేపం. కానీ సామాజిక మానసికత మారకుండా, కేవలం విధానాలతో సమస్య పరిష్కారం సాధ్యం కాదు. భవిష్యత్తులో బంగారం ధరలు ఇలాగే పెరుగుతూ ఉంటే, మధ్యతరగతి సమాజంలో ఆర్థిక అస్థిరత, వినియోగ సామర్థ్యంలో తగ్గుదల, అప్పుల భారంతో కూడిన జీవితం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. దీర్ఘకాలంలో ఇది ఒక తరతరాల పేదరిక చట్రంగా మారే ప్రమాదం ఉంది. నివారణ మార్గాలుగా ముందుగా సామాజిక దృక్పథంలో మార్పు అవసరం. కట్నం, ఆడంబర వివాహాలను సామాజికంగా నిరుత్సాహపరచాలి. బంగారాన్ని గౌరవానికి ప్రమాణంగా కాకుండా, ఒక సాధారణ పెట్టుబడి సాధనంగా మాత్రమే చూడాలి. ప్రజలు మ్యూచువల్ ఫండ్లు, పెన్షన్ పథకాలు, సావరిన్ గోల్డ్ బాండ్లు వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలను ఎంచుకోవాలి. ప్రభుత్వం ఆర్థిక విద్యను పాఠశాల స్థాయి నుంచే ప్రవేశపెట్టి, ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాలి. ముగింపుగా, బంగారం ధరల పెరుగుదల అనేది కేవలం మార్కెట్ పరిణామం కాదు, అది ఒక వ్యవస్థాత్మక ఆర్థిక హెచ్చరిక. దీన్ని సమాజం సమయానుకూలంగా గ్రహించకపోతే, మధ్యతరగతి మాత్రమే కాదు, జాతీయ ఆర్థిక వ్యవస్థ కూడా దీర్ఘకాలంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. బంగారం కంటే విలువైనది మన మానవ మూలధనం, ఆర్థిక అవగాహన, సామాజిక సంస్కరణలే అన్న సత్యాన్ని గుర్తించడమే నిజమైన పరిష్కారం.

సూర్య



# చల్మెడ శ్రీతిరుమల స్వామి ఆలయ హుండీ లెక్కింపు





**నిజాంపేట,ఫిబ్రవరి3(సూర్యరేఖ)**మండల పరిధిలోని శ్రీతిరుమల స్వామి జాతర బ్రహ్మోత్సవాలలో భాగంగా జనవరి 3 నుండి ఫిబ్రవరి 3వరకు31రోజులకు సంబంధించి తిరుమలస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం చేపట్టారు. ఈ హుండీ లెక్కింపులో రూ.84,709 విరాళంగా వచ్చాయని ఆలయ ఈవో రవికుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మూడు రోజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి సందర్శించిన భక్తుల పరంగా వచ్చిన హుండీ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.ఇట్టి డబ్బులను బ్యాంకులో జమ చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రమ్యశ్రీ సీనియర్ అసిస్టెంట్ రమేష్,ఆలయ కమిటీ చైర్మన్ అక్కపల్లి రాంరెడ్డి, ఆలయ డైరెక్టర్లు బాజా రమేష్,తుమ్మల రమేష్,కాకి రాజయ్య ఎల్లాగౌడ్ హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుల్ రమేష్ ఆలయ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచ్ సొంత ఖర్చులతో విద్యార్థులకు ట్యూషన్..



**నిజాంపేట,ఫిబ్రవరి3 (సూర్యరేఖ)** మండలం నగరం తాండ ఉపసర్పంచ్ నాజం తన ఉదారతను చాటుకున్నారు.ఇచ్చిన మాటకు కట్టుబడి,గ్రామంలోని పాఠశాల విద్యార్థుల కోసం తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా ఉపాధ్యాయుడిని నియమించి ట్యూషన్ ఏర్పాటు చేశారు.పాఠశాల సమయం ముగిశాక విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను,నైపుణ్యాలను పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.తండా విద్యార్థుల భవిష్యత్తు కోసం తమవంతు కృషి చేస్తామన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిన..మరికల్ సీఐ భగవంత్ రెడ్డి



**మరికల్ (ధన్వాడ),ఫిబ్రవరి03(సూర్యరేఖ)**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు మరికల్ పరిధిలోని జాతీయ రహదారి 167పై రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా పోలీసు అధికారులు ప్రధాన రోడ్లపై క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలనలు నిర్వహించినట్లు మరికల్ సిఐ భగవంత్ రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా మరికల్ సిఐ భగవంత్ రెడ్డి,ఎస్సై రాము ఆర్ అండ్ బి ఏఈ అభిలాష్,నేషనల్ హైవే అథారిటీ నాగవర్ధన్ అధికారుల బృందం జాతీయ రహదారి 167 పై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్న బ్లాక్ స్పాట్స్ నీ కొన్ని గుర్తించడం జరిగిందని,అవి తీలేరు గేటు,సిసీ కుంట రోడ్డు,పసుపుల రోడ్డు,శ్రీవాణి స్కూలు వద్ద ఉన్నాయని,యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలను ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు గల కారణాలను సమీక్షించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఓవర్ స్పీడింగ్, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన,రోడ్డు వెడల్పు లోపం, స్పీడ్ బ్రేకర్ల లేమి,మలుపుల వద్ద,సరైన సైన్ బోర్డులు లేకపోవడం,టౌన్ లలో రోడ్డుపై వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై అధికారుల దృష్టి సారించినట్లు పేర్కొన్నారు.ఈ పరిశీలనలో గుర్తించిన సమస్యలను త్వరలో నిర్వహించే రోడ్ సేఫ్టీ మీటింగ్లో చర్చించి, సంబంధిత శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం,రోడ్డు మరమ్మతులు ట్రాఫిక్ సూచిక బోర్డుల ఏర్పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## జిల్లా సరిహద్దు బ్రిడ్జ్ ను పరిశీలించిన కామారెడ్డి పీఆర్డీఈ



**నిజాంపేట,ఫిబ్రవరి3(సూర్యరేఖ)** మండ పరిధిలోని నంద గోకుల్ గ్రామం నుండి ఇస్సానగర్ వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బ్రిడ్జ్ గత కొన్ని నెలల క్రితం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి కింది భాగం పూర్తిగా కొట్టుకుపోయి కూలిపోయే దశలో చేరుకుంది.దీంతో కామారెడ్డి జిల్లా పీఆర్డీఈ స్వామిదాస్ స్పందించి మంగళవారం బ్రిడ్జిని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడు తూ. గత వర్షకాలం కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జ్ కింది భాగం పూర్తిగా కొట్టుకుపోవడం జరిగింది.ఈ బ్రిడ్జిపై భారీ వాహనాలు వెళ్ళవద్దని. ఇట్టి సమస్యను వెంటనే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాతూరి భాను ప్రకాష్ రెడ్డి,ఇస్సానగర్ సర్పంచ్ ధర్మాగారి రాజాగౌడ్ నాయకులు పాతూరి బాల్రెడ్డి, కృష్ణయాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ వాటర్ సప్లై పై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం



**నిజాంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో వచ్చే ఎండ కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి లేకుండా ఉండడానికి జిల్లా కలెక్టర్,జిల్లా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాల మేరకు డ్రింకింగ్ వాటర్ సప్లై పైన స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రామ్ ను గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం అధ్యక్షతన గ్రామసభ నిర్వహించి గ్రామస్తులకు పలు సూచనలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామానికి వచ్చే మిషన్ భగీరథ బల్క సప్లై మరియు అన్ని త్రి ఫేస్ మోటర్లు,సింగల్ ఫేస్ మోటర్లు అన్నిటిని కూడా వర్కింగ్ కండిషన్లో ఉండడానికి వారికి సూచనలు చేయడం జరిగింది.ఆలాగే ఎండాకాలంలో నీటి వృధాను అరికట్టి నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు.ఇట్టి కార్యక్రమము జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈ నెల 2 నుండి 20 వరకు నిర్వహించడం జరుగుతుంది.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆకుల మహేందర్,మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి,వార్డు సభ్యులు,మిషన్ భగీరథ హెల్పర్లు పాల్గొన్నారు.


## పల్లె దవాఖాన ప్రహరీగోడ నిర్మించండి సారూ.!




**నిజాంపేట,ఫిబ్రవరి3(సూర్యరేఖ)**మండల కేంద్రంలోని పల్లె దవాఖానకు ప్రహరీగోడ నిర్మించాలని దవాఖాన సిబ్బంది,గ్రామస్తులు కోరుతున్నారు.దవాఖానకు ప్రహరీగోడ లేకపోవడంతో రాత్రి వేళలో మందు బాబులకు అడ్డగా మారింది.రోజు హాస్పిటల్ తెరిచే సమయానికి ఖాళీ సీసాలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. దవఖాన ముందర కుక్కలు,పందులు స్వైర విహారం చేయడంతో వాటి దుర్వాసనకు దవఖానకు వచ్చే రోగుల సంఖ్య కూడా తగ్గుతుందన్నారు. దవఖానకు ప్రహరీ గోడ నిర్మించాలని,గతంలో కూడా అధికారుల మొరపెట్టుకున్న లాభం లేకుండా పోయిందన్నారు. ఇకనైనా స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీగోడ నిర్మాణానికి కృషి చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తన వంతు ఆర్థిక సాయం..

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ఉపాధ్యక్షుడు కల్లూరు హనుమంతరావు..



**శివంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని ఎదుల్లపూర్ గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్,తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు ఉపాధ్యక్షుడు కల్లూరు హనుమంతరావు మున్నూరు కాపు ఆత్మగౌరవ భవన నిర్మాణముకై కల్లూరి హనుమంతు తన వంతు పాత్ర పోషించడానికి మున్నూరు కాపు పౌండేషన్ కి రూ.5 లక్షలను ఆర్థిక సహాయం చేశాడు.ఇందులో భాగంగా వారి కుటుంబ సభ్యుల పేరు మీదుగా కల్లూరి హరికృష్ణ,కల్లూరి విశాల్,కల్లూరి ట్రెన్సి రావు పటేల్, కల్లూరి హరిత,కల్లూరి చందన పేరుల మీదుగా లక్ష రూపాయలు చొప్పున రూ. 5లక్షల చెక్కును ఫౌండేషన్ కి అందజేశారు.ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు మాట్లాడుతూ... దాతృత్వం,దానగుణం,సేవా గుణం ఉన్నప్పుడే సమాజం ఎంతో కొంత ప్రగతి సాధిస్తుందని ఈ సందర్భంగా కల్లూరు హనుమంతరావుని అభినందించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఈసంపల్లి వెంకన్న పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం..

చెంది సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్ గౌడ్



**శివంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** శివంపేట్ మండలంలోని చంది గ్రామానికి చెందిన బంగారగాని దుర్గయ్య మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు వారికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బాధ్యత కుటుంబానికి అన్ని విధాల తమ వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎల్లం స్థానిక ఉపసర్పంచ్ సౌజన్య,వార్డు సభ్యులు సంధిల శ్రీనివాస్ గౌడ్,షేక్ నలేహ అబ్దుల్లా,వీరేష్, బంగారిగారి వెన్నెల నాగరాజు బీఆర్ఎస్ నాయకులు మధు,శంకరయ్య అశోక్,తదితరులు పాల్గొన్నారు.

## డంపు యార్డ్ నిర్మాణము తక్షణమే నిలిపివేయాలని వినతి పత్రం..

స్థానిక తాహసిల్దార్ కి వినతి పత్రం



**శివంపేట,ఫిబ్రవరి 03(సూర్యరేఖ)** శివంపేట మండలానికి చెందిన డంప్ యార్డ్ చంది గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 334 ప్రభుత్వ భూమిలో 76 నిర్మాణం కొరకు సర్వే చేసి శివంపేట గ్రామస్తులకు కేటాయిస్తున్నారు.దీంతో గ్రామా పంచాయతీ పాలకవర్గం,గ్రామ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఇట్టి నిర్మాణ పనులు తక్షణమే ఆపివేయాలని స్థానిక తహసిల్దార్ కమలాద్రికి వినతి పత్రం అందజేశారు.ఇట్టి స్థలం గ్రామానికి అనుకోని ఉండడం వలన దుర్వాసన వస్తుందని,మరియు అపరిశుభ్ర వాతావరణానంగా మారుతుందని నిర్మాణం పనులను తక్షణమే నిలిపివేయాలని కోరారు.ఇట్టి స్థలంలో ప్రభుత్వ భవనంలో స్కూల్, హాస్టల్స్ నిర్మాణంకు ఇలాంటి అభ్యంతరం లేదని సర్పంచ్ గైనబైటి ప్రవీణ్ గౌడ్ తెలియజేశారు.

## కల్లూరులో కాంగ్రెస్, సిపిఐ పొత్తు..

### కల్లూరు మున్సిపాలిటీలో సిపిఐకి కోఆప్షన్ ఇచ్చే ఒప్పందం..




**ఖమ్మం,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్,సిపిఐ పార్టీకి పొత్తు కుదిరినట్లు డాక్టర్ దయానంద్ తెలిపారు. పొత్తులో భాగంగా సిపిఐకి కో-ఆప్షన్ మెంబర్ ఇచ్చే హామీతో పొత్తు కుదిరిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్ట దయానంద్ తెలిపారు. మంగళవారం పసుమర్తి చంద్రావు ఇంటివద్ద జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పొంగులేటి ప్రసాదరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి,16వ వార్డు కౌన్సిల్ మెంబర్ అభ్యర్థి సిపిఐ పార్టీ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దామల రాజు గెలిపించాలని ఈ సమావేశంలో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉబ్బన దేవదాస్,జనార్ధన్,పెద్ద పోయిన శీను,మురళి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థన సమయంలో నిలకడగా ఉండాలి

రెవరెండ్ కె.సుందర్ పాల్

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి3 (సూర్యరేఖ)** ప్రార్థన సమయంలో నిలకడగా ఉండి కృతజ్ఞత గలవారై మెలకువగా ఉండాలని రాజేంద్రనగర్ పోస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ కె.సుందర్ పాల్ అన్నారు.రాజేంద్రనగర్ ప్రార్థన యోధుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం కో-ఆర్డినేటర్లు రెవరెండ్ జేపీ పాల్ అధ్యక్షతన బుద్వేల్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవరెండ్ కె.సుందర్ పాల్ మాట్లాడుతూ...ప్రతి రోజు దైవ సేవకులు ఉదయం7గంటల నుంచి 8గంటల వరకు దేశం నాయకులు ప్రజలు సంఘాల కోసం ప్రార్థనలు చేయడం సంతోషకర మన్నారు.నిరంతరం ప్రార్థనలు చేయాలన్నారు. ప్రార్థనల వల్ల కలిగే ప్రయోజనాలకు దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించే వారిగా ఉండాలన్నారు. రాజేంద్రనగర్ ప్రాంతంలో చేస్తున్న ప్రార్థనల వల్ల అనేక మేలు జరుగుతున్నాయన్నారు.సమావేశంలో మాట్లాడిన కో-ఆర్డినేటర్ రెవరెండ్ ఎన్.రాజారాం మాట్లాడుతూ. ..ప్రతి రోజు ఎక్కువ సమయం ప్రార్థన చేసేవారిగా ఉండాలన్నారు.ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రార్థన యోధుల ఆత్మీయ



సమ్మేళనం నిర్వహించుకుందామన్నారు.జూన్ 5వ తేదీన రాజేంద్రనగర్ మండల పోస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గెట్ టు గదర్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజు సమయానికి ప్రార్థనకు వస్తున్న పాస్టర్లు, పాస్టరమ్మలను గులాబి పూలను అందచేసి అభినందించారు.పోస్టర్స్ ఫెలోషిప్ తరపున ప్రార్థనలను ప్రతి రోజు నడిపించడానికి సారధ్యం వహిస్తున్న కో-ఆర్డినేటర్లు రెవరెండ్ జేపీ పాల్, రెవరెండ్ ఎన్.రాజారాం,రెవరెండ్ జె.పాల్ దేవరాజ్ లను సన్మానించారు.పాస్టర్ బట్టు శ్రీకాంత్ పాస్టర్ మోజేస్,సిస్టర్ కృపమ్మకు ఆర్థిక సహాయం చేసి దేవుని ప్రేమను కనబరిచారు.రెవరెండ్ సీహెచ్. సునీల్ సామ్యూల్ పాస్టర్ మోజేస్ కు సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో పోస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు రెవరెండ్ సామ్యూల్ రాజ్ తో పాటు పాస్టర్ స్వర్ణ,పాస్టర్ లీనా దేవదాస్,పాస్టర్ స్పందన,పాస్టర్ ఎస్.యేసుమణి పలువురు పాస్టర్లు పాస్టరమ్మలు పాల్గొన్నారు.

## ఉప్పల్ సీఐ భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రింట్&ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కార్యవర్గ కమిటీ సభ్యులందరూ అధ్యక్షులు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉప్పల్ సీఐ కె.భాస్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఐ భాస్కర్ నూతన కమిటీ సభ్యులను అభినందించి,మీడియా క్లబ్‌కు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు తమను తాము పరిచయం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ మాధవరెడ్డి, ఎస్ఐలు చిరంజీవి,మధు,పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# బాలకృష్ణనగర్ కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు





ఆకారపు అరుణ్ పటేల్

**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వరములో 20 రోజుల క్రితం అధికారులతో నిర్వహించిన'బస్తీబాట' నిర్వహించారు. బాలకృష్ణనగర్ కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్ద సహకారంతో 20 రోజుల్లో కొత్త స్తంభాలు15 వేయించడం జరిగింది. స్తంభాల ఏర్పాటును ఆయన స్వయంగా పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని తెలియజేసిన వెంటనే స్పందించి, పనులను పూర్తి చేయించిన అరుణ్ పటేల్ పనితీరుపై కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి,అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న ఆకారపు అరుణ్ పటేల్ కి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లు సతీష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు వేణుగోపాల్ చారి నాగమల్లయ్య కాసింగౌడ్ నాగరాజు బ్రహ్మయ్య శంకర్ షాభా రామచంద్ర నరసింహ రాము శ్రీనివాస్ బాలాజీ ప్రణయ్ పవన్ విష్ణు భరత్ చరణ్ మహిళలు స్రవంతి నాగలక్ష్మి నాగమణి జెక్కాశారద పలువురు కాంగ్రెస్ నాయకులు కాలనీ పెద్దలు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ కు భవనం నిర్మించండి





పరమేశ్వర్ రెడ్డిని కోరిన క్లబ్ నూతన కమిటీ

**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు మంగళవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందు ముల పరమేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి నూతన కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. మీడియా సమావేశాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా అనువైన భవనాన్ని నిర్మించాలని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డిని క్లబ్ ప్రతినిధులు కోరి వినతి పత్రాన్ని అందజేశారు.ప్రతినిధుల కోరిక మేరకు పరమేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి చెప్తానని హామీ ఇచ్చారు.క్లబ్ సభ్యులు అంతా సమిష్టిగా ఉండి క్లబ్బును ముందుకు తీసుకెళ్లాలని పరమేశ్వర్ రెడ్డి సూచించారు. నూతనంగా ఏర్పడిన కమిటీకి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## స్నేహపురి కాలనీలో రూ.33 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతిసాయి జన్ శేఖర్



**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** నాచారం డివిజన్ పరిధిలోని స్నేహపురి కాలనీలో రూ.33 లక్షలతో కొత్తగా వేస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికా వచ్చాయి. జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం నాచారం కార్పొరేటర్ శాంతిసాయి జన్ శేఖర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ వెల్లడించారు. డివిజన్ పరిధిలోని దాదాపు 90శాతం కాలనీలో సీసీ రోడ్డు పనులను పూర్తి చేసినట్లు డ్రైనేజీ పనులు పూర్తికాని ప్రాంతాల్లో సిసి రోడ్డు పనులను ఆపి డ్రైనేజీ పూర్తి అయ్యాక సిసి రోడ్లు నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు.ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు దృష్టికి స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## కల్లూరు మున్సిపాలిటీపై కషాయం జండా ఎగరేస్తాం..



**ఖమ్మం,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని బిజెపి మండల అధ్యక్షులు గుమ్మా రామకృష్ణ ఆధ్వర్యంలో 20 వార్డులకు 16 వార్డుల కౌన్సిలర్ కు మంగళవారం బీఫాము,లు అందజేసి అభ్యర్థులను అభినందించారు.భారతీయ జనతా పార్టీ విజయ పథకం కల్లూరు మున్సిపాలిటీ పై ఎగరవేయటం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు,చెన్ను వెంకటేశ్వరరావు యాపా సీతయ్య,ఆపద రామారావు,కుమిలి శ్రీనివాసరావు కౌన్సిలర్లు పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

## 12వ వార్డు కౌన్సిలర్ కు బ్రహ్మరథం పట్టిన ఓటర్లు..



**ఖమ్మం,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్ గా షేక్ ఉస్మాన్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ప్రచారంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు , సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గురించి తెలియజేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దారా రంగా,పెద్దబోయిన శ్రీనివాసరావు,షేక్ ఇబ్రహీం,షేక్ తురాబ్ అలీ,ఎస్కే మైబు,ఎస్.కె.బాబు హుస్సేన్,ఎస్కే పాషా,ఎస్కే ఇలియాజ్,యాకూబ్ బాజీ,ఎండి హుస్సేన్ ఇలియాజ్, షాపి,ఎస్కేకమ్లి మొదలగు వారు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలి..



జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**కొల్చారం,ఫిబ్రవరి03 (సూర్యరేఖ)** ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రశాంతంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఇంటర్ విద్యాధికారులకు సూచించారు. మంగళవారం కొల్చారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్ను పరిశీలించారు. ల్యాబ్ రూముల్ని,ల్యాబ్ మెటీరియల్ పరిశీలించి, ప్రాక్టికల్స్ ఏ విధంగా జరుగుతున్నాయి అని విద్యార్థులను ఆరా తీశారు.విద్యార్థుల రికార్డులను సీసీ కెమెరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ...ఇంటర్ విద్యార్థులు ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా చేసుకొని,ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు స్పెషల్ క్లాసులు అటెండ్ కావాలన్నారు. ఈ నెల10 వ తేదీ వరకు జరగనున్న ప్రాక్టికల్స్ ని ప్రశాంతంగా జరగాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్యాధికారి మాధవి,చీఫ్ సూపరిండెంట్ నవీన్,కళాశాల అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు

**అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వక భేటీ**





**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ నూతన అధ్యక్షుడు,సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యులు ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారం, సమాజాభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలులో మీడియా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను ప్రజల వరకు సమర్థవంతంగా తీసుకెళ్లడంలో మీడియా మిత్రుల సహకారం అవసరమని తెలిపారు.రాబోయే రోజుల్లో ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక సేవా కార్యక్రమాలు,ప్రజా హిత కార్యక్రమాలకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.

# రామంతపూర్ డివిజన్‌లో దశలవారీగా అభివృద్ధి పనులు





**సిసి రోడ్డు పనులను పరిశీలించిన మహమ్మద్ రఫీక్**

**రామంతాపూర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** రామంతపూర్ డివిజన్‌లో సమస్యలు లేకుండా దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్ అన్నారు.రామంతపూర్ ఇందిరానగర్ మెట్లగల్లీలో కొత్తగా నిర్మిస్తున్న సిసి రోడ్ల పనులను రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొహమ్మద్ రఫీక్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉప్పల్ ఇంచార్జ్ మంద ముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో దశాల వారీగా రామంతపూర్ డివిజన్ అన్ని పనులు పూర్తి అవుతాయని తెలియ జేశారు.పెండింగ్‌లో ఉంటే గుర్తించి వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులను సూచించారు. కాలనీవాసులు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే ఉప్పల్ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామ న్నారు.గతంలో సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన కాలనీలు..నేడు సకల వసతులతో సుందరంగా దర్శనమిస్తున్నాయి.సిసి రోడ్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు కాంట్రాక్టర్ కి సూచించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పూస సత్తయ్య, ఆదినారాయణగౌడ్ పూస మల్లికార్జున్ సత్యనారాయణ సూర్య ఐకాన్ మధు స్వామి సాయి అబ్దుల్ మతిన్ ఉప్పల్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ షకీల్ రమేష్ శ్రీనివాస్ అంజి తదితరులు పాల్గొన్నారు.

# శక్తిసాయినగర్ డివిజన్ రాజీవ్ గృహకల్పలో బస్తీ బాట నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్





**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** శక్తిసాయినగర్ డివిజన్ పరిధిలోని జే.ఎన్.ఎన్.యు. ఆర్ఎమ్ కాలనీ (ఫేజ్1,రాజీవ్ గృహకల్ప)లో మంగళవారం కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ "బస్తీబాట"కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య,త్రాగునీటి సరఫరా లోపాలు,వీధి దీపాల మరమ్మత్తుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, స్థానిక ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత ఉన్నతాధికారులతో నెమలి అనిల్ కుమార్ ఫోన్ ద్వారా మాట్లాడి,వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేలా నిరంతరం ఫాలోఅప్ చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ..."ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం..కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరించే బాధ్యత నాది"అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి,జాయింట్ సెక్రటరీ ఉండం శ్రీనివాస్ కొయలకొండ రాజేష్,శైలజ గౌడ్ దాసరి సాయి స్థానిక నివాసితులు లక్ష్మణ్, రాజు శేఖర్ చాణక్య కిషోర్ రవి సోమరాజు శ్యామ్‌నాగరాజు శర్మ శైలజ భాగ్యరాజు శామ్యూల్, శ్రీనివాస్ శ్రీశైలం రాము,తదితరులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు-కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు జరుగుతూనే ఉన్నాయి.ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.ఉప్పల్ డివిజన్ లోని గాంధీనగర్ మార్కెట్ కాలనీ పెద్దలు హనుమంత్ రెడ్డి,జి. అబ్రహం,బాలరాజు నర్సింగరావు అమరనాథ్,గాంధీ నగర్ యూత్ అసోసియేషన్ యువకులు శేఖర్, శివకుమార్ సాయిరెడ్డి మనోజ్ చింతా భరత్, నర్సింహా మల్లేష్ చిన్న మహేందర్ దేవేందర్,శివ, కిరణ్ క్రాంతి మల్లి కళ్యాణ్,భాస్కర్ అంబికా అశ్విని కాంగ్రెస్ పార్టీలో చేరారు.ప్రతి ఒక్కరికీ పరమేశ్వర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బజార్ జగన్నాథ్ గౌడ్,ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ,కంది శ్రవణ్ రెడ్డి విజయ్ కుమార్,రాజన్న,జావిద్,గొరిగే జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

## 28వ వార్డులో బీఆర్ఎస్‌కు గుడ్‌బై కాంగ్రెస్‌లోకి అలీబాయి..



**బెల్లంపల్లి,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణం 28వ వార్డుకు చెందిన టీఆర్ఎస్ నాయకుడు అలీబాయి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం సేవలు చేసినప్పటికీ,పార్టీ తన సేవలను గుర్తించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.పార్టీని, పార్టీ నాయకత్వాన్ని నమ్ముకొని తాను ఎన్నో కష్టాలు పడ్డానని,అయినా చివరకు తన శ్రమ వృథా అయిందని అలీబాయి తెలిపారు.ఎంత చేసినా గుర్తింపు లభించకపోతే,కింది స్థాయి కార్యకర్తల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పాతగా పనిచేసిన వారిని పక్కన పెట్టి,కొత్తగా వచ్చిన వారికి అవకాశాలు కల్పించడం పార్టీలకు అలవాటుగా మారిందని విమర్శించారు.ఇలాంటి పరిస్థితుల్లో తీవ్ర మనస్తాపానికి గురైన తాను తనను గుర్తించిన పార్టీలో కొనసాగాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నట్లు అలీబాయి తెలిపారు.

## రాయికల్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు రాజీనామా..



**రాయికల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** జగిత్యాల జిల్లా రాయికల్ మండల కాంగ్రెస్ యువజన అధ్యక్షులు బత్తిని నాగరాజు కాంగ్రెస్ సభ్యత్వానికి అలాగే అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు.తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు గాజేశీగి నందయ్యకు పంపడం జరిగింది.9వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తుండగా బీఆర్ఎస్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాంద్ర రమాదేవి అభ్యర్థిగా పోటీకి దించడం ఒకే సామాజిక వర్గానికి చెందిన సంజయ్ కుమార్ బీసీలను అణగదొక్కుతున్నాడని దీనివల్ల అర్థమైతుందని తెలిపారు.పట్టణ ప్రజలు గమనిస్తున్నారని బీసీలను అనాగదొక్కే ప్రయత్నం చేస్తున్నారు.ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ...అసలు కాంగ్రెస్ ఉన్నదా అనేది జీవన్ రెడ్డి నాయకత్వం లోనే ఉంది కానీ బీఆర్ఎస్ లో ఉన్నవారికి టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం అన్నారు.ఇంతవరకు బీఆర్ఎస్ లోనే ఉండి కాంగ్రెస్ టికెట్లు తీసుకోవడంమొత్తం జగిత్యాల నియోజకవర్గంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు నిరాశగా ఉన్నారని వారు అన్నారు.ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మేకల రమేష్ పట్టణ యువజన నాయకుడు బత్తిని నాగరాజు, కడకుంట్ల నరేష్, తదితరులు ఉన్నారు

## హామీ ఇచ్చాను..అమలు చేస్తున్న చిన్న ఘనపూర్ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి



**కొల్చారం,ఫిబ్రవరి03 (సూర్యరేఖ)**స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇచ్చిన హామీని కొల్చారం మండలం చిన్న ఘణపుర్ గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి మాట నిలబెట్టుకున్నారు.సర్పంచ్ గా తనను గెలిపిస్తే చిన్న ఘణపుర్ గ్రామంలో ఎవరైనా ఆడపిల్ల పుడితే మీ ఇంటి మహాలక్ష్మికి మా ఇంటి చిరు కనుకగా రూ.5116 సొంత డబ్బులు ఇస్తానని మాట ఇచ్చారు.ఇచ్చిన మాట ప్రకారం చాకలి జ్యోతి శ్రీనివాస్ దంపతులకు ఆడపిల్ల పుట్టినందుకు మంగళవారం గ్రామస్థుల సమక్షంలో జ్యోతి శ్రీనివాస్ దంపతులకు రూ.5116 నగదు అందజేశారు. సర్పంచ్ మధుసూదన్ రెడ్డి నిర్ణయం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి ఉప సర్పంచ్ నర్సింలు మాజీ సర్పంచ్ గడిల ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపిటిసి వడ్ల లక్ష్మీపతి,మాజీ సొసైటీ చైర్మన్ మంద నాగయ్య,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను హత్య చేసేందుకు యత్నించిన భర్త అరెస్ట్..

**52 కేసుల్లో భర్త నిందితుడు**

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**భార్యను హత్య చేసేందుకు యత్నించిన భర్తను మైలార్ దేవ్ పల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.ఎస్సై రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...మహారాష్ట్ర లాతూర్ కు చెందిన శంకర్ (40)శారద దంపతులు,శంకర్ స్నాచింగ్లు, దొంగతనాలకు పాల్పడటంతో అతనిపై 52 కేసులు నమోదయ్యాయి. పలుసార్లు జైలుకు వెళ్లి వచ్చాడు. అయినా అతడి బుద్ధి మారకపోవడంతో భార్య శారద శంకర్ ను ఎనిమిది సంవత్సరాల క్రితం వదిలేసి మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతికాలనీకి వచ్చిఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటుంది.ఈ మధ్య జైలు నుంచి తిరిగి వచ్చిన శంకర్ శారద ఉంటున్న నివాసానికి వచ్చాడు. ఈనెల 1వ తేదీన శంకర్ శారదతో గొడవ పడుతుండగా శారద అన్న స్నేహితుడు శంకర్ ను మందలించాడు.దీంతో కోపం పెంచుకున్న శంకర్ అదే రోజు రాత్రి భార్య శారద,మరో వ్యక్తిని కత్తితో హత్య చేసేందుకు ప్రయత్నించగా వారు ఇరువురు పారిపోయారు.శారద ఫిర్యాదు మేరకు మైలార్ దేవ్ పల్లి పోలీసులు కేసు నమోదు చేసి శంకర్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# ప్రాథమిక పాఠశాలకు టీవీ అందచేత



**శివంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** శివంపేట మండలంలోని చెన్నాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ కొమురయ్య, ఉపసర్పంచ్ శ్రీలత శ్రీనివాస్ సొంత నిధులతో టీవీని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శివంపేట మండల విద్యాశాఖ అధికారి బుచ్చా నాయక్ ని నూతన పాలకవర్గం సన్మానించారు. గ్రామ తాజా మాజీ సర్పంచ్ బొల్ల భారతి బిక్షపతి ప్రతి మంగళవారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొమురయ్య ఉపసర్పంచ్ గుమ్మల శ్రీలత శ్రీనివాస్,వార్డు సభ్యులు గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామచంద్రగౌడ్ మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు వెంకట్ రెడ్డి సతీష్ యాదవ్,ఊర్మిళా అంజగౌడ్,ఎరుకలి ఎల్లమ్మ సాయిలు,బోయిని సతీష్ యాదవ్,ఆకుల యాదగిరి పార్టీ సీనియర్ నాయకులు యుద్ధంరెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సాగౌడ్ ఉపాధ్యాయులు లావణ్య,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి బుచ్య నాయక్, పిఆర్టియు మండల అధ్యక్షులు అనిల్ రెడ్డి,సిఆర్పి ఆకుల దాసు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేటలో జోరుగా ప్రచారం

కాంగ్రెస్ బిజెపి బీఆర్ఎస్,లు ఇంటింటి ప్రచారం..
2,3వ వార్డుల్లో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.రాజేందర్ రెడ్డి
పేట మున్సిపాలిటీ కైవాసం చేసుకుంటాం...మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి





**నారాయణపేట(ధన్వాడ),ఫిబ్రవరి03(సూర్యరేఖ)** నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్,బిజెపి,బీఆర్ఎస్,లు ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టారు. గెలుపే ధ్యేయంగా పనిచేస్తూ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ముఖ్యనాయకులు కార్యకర్తలు ఓటర్లను ఓటు అభ్యర్థిస్తున్నారు. మా అభ్యర్థికి ఓటెయ్యండి. మా పార్టీకి ఓటెయ్యండి మేము అభివృద్ధి చేసి చూపిస్తాం.. అవకాశం ఇవ్వండి అంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పార్టీ అభ్యర్థుల కోసం ఇంటింటి ప్రచారాన్ని మొదలుపెట్టి పార్టీ నాయకులను కార్యకర్తలను ఉత్సాహపరుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచిన నారాయణపేట పట్టణంలో మున్సిపాలిటీ వార్డులలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే ఈరోజు మున్సిపాలిటీ వార్డులలో దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి అన్నారు మంగళవారం నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో రెండు మూడు వార్డులలో ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని వార్డ్ ప్రజలతో మమేకమై మూడవ వార్డులో కాకర్ల నారాయణమ్మ రెండవ వార్డులో సుతారి అరుణరామ్ రెడ్డి అభ్యర్థులను కారు గుర్తుకు ఓటేసి పెద్ద ఎత్తున మెజార్టీతో గెలిపించాలని ఆయన అన్నారు. నారాయణపేట మున్సిపాలిటీ చైర్మన్ పదవిని బీఆర్ఎస్ పార్టీ కైవాసం చేసుకొని మున్సిపాలిటీపై గులాబీ జెండాను ఎగరవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించే అభివృద్ధికి సహకరించాలని పట్టణ ప్రజలను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెండు మూడు వాడల్లో ఉన్నటువంటి బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో విలేకరులకు తహసిల్దార్ పూల్ సింగ్ చౌవాన్ ఘన సత్కారం




**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రింట్&ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో విలేకరులు ఉప్పల్ మండల తహసిల్దార్ చౌహన్ పూల్ చౌహన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ విలేకరులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో మీడియా నాలుగో స్థంభంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తోందని ప్రశంసించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో విలేకరుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను ప్రజల వరకు సమర్థవంతంగా చేరవేయడంలో మీడియా మిత్రుల సహకారం అవసరమని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజాహిత కార్యక్రమాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో విలేకరులతో సమన్వయంతో ముందుకు సాగుతామని తహసిల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్తో పాటు పలువురు విలేకరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షులు ఆధ్వర్యంలో విలేకరులకు మాస శేఖర్ ఘన సత్కారం



**ఉప్పల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు,సీనియర్ జర్నలిస్ట్ వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో విలేకరులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏఐఎస్సీఆర్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చిలుకానగర్ మాల సంక్షేమ సంఘం అధ్యక్షులు మాస శేఖర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాస శేఖర్ విలేకరులను శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి దిశానిర్దేశం చేస్తోందని ప్రశంసించారు. ప్రజల సంక్షేమం,సామాజిక న్యాయం,అభివృద్ధి అంశాల్లో మీడియా మిత్రుల సహకారం ఎప్పటికీ అవసరమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా హిత కార్యక్రమాలు సామాజిక సేవా కార్యక్రమాల్లో మీడియాతో సమన్వయంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రింట్ &ఎలక్ట్రానిక్ మీడియా క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ తో పాటు పలువురు విలేకరులు పాల్గొన్నారు.

## నేడు కాటేదాన్ సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కాటేదాన్ సబ్ స్టేషన్ ఫిడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం బుధవారం ఉదయం 2:00గంటల నుండి మధ్యాహ్నం 5:00గంటల వరకు ఈ క్రింది ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తున్నట్లు కాటేదాన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రవీణ్ తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడ గ్రామం,ఆర్జికె (పింక్ క్వార్టర్స్ అండ్ వైట్ క్వార్టర్స్, గణేష్ నగర్,బృందావన్ కాలనీ,హౌసింగ్ బోర్డ్ కాలనీ, వాంబేకాలనీ,నిత్యవెంచర్,టిఎన్జిఓఎస్ కాలనీ, అమ్మ గార్డెన్స్,పయనీర్ స్కూల్,షామా టెంట్ హౌస్, బాబా టెంట్ హౌస్,బాలాజీనగర్,మోడీ బిల్డర్స్, పారిశ్రామిక ప్రాంతం,స్విమ్మింగ్ పూల్ ప్రాంతం, మల్లన్న దేవాలయం ప్రాంతం,కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

## ఎల్లంపేట చైర్మన్ పదవి బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుంది..

గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుంది..
ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి



**మేడ్చల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని సోమారం రావల్ కోల్ వార్డులలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ...గ్రామాలను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 10 ఏండ్లు అధికారంలో ప్రజలకు మంచినీటి సౌకర్యం,24 గంటల విద్యుత్ సౌకర్యం,రైతుబంధు,రైతు బీమా, కల్యాణలక్ష్మి,షాది ముబారక్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైనదని అన్నారు. గ్రామాలలో మంచినీటి సమస్య తీవ్రతరమైందని ప్రజలు అనేక రకాలైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల్లో ఓటు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసి తప్పు చేశామని ప్రజలు భావిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన శ్రీదేవి నాయక్ తమ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా భారీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి ఇంచార్జ్ మహేందర్ రెడ్డి,ఎలక్షన్ ఇంచార్జ్ వెంకట్ రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు భాస్కర్ యాదవ్,దయానంద్ యాదవ్,నవీన్ రెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి,హరత్ రెడ్డి,మాజీ వైస్ఎంపీపీ వెంకటేష్,రాగ జ్యోతి రాజ్ కుమార్ రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల బరిలో 173మంది అభ్యర్థులు..



**బెల్లంపల్లి,ఫిబ్రవరి03 (సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో మొత్తం 251మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అందులో 78మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని ప్రస్తుతం 173మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో కొనసాగుతున్నారని మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి తెలిపారు. పార్టీల వారీగా చూస్తే భారతీయ జనతా పార్టీ నుంచి 20మంది,బహుజన సమాజ్ పార్టీ నుంచి 6మంది, భారత జాతీయ కాంగ్రెస్ నుంచి 34మంది,ఎంఐఎం నుంచి 2మంది,భారత రాష్ట్ర సమితి నుంచి 34మంది,ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి 1మంది,భారత కమ్యూనిస్టు పార్టీ నుంచి 6మంది,జనసేన పార్టీ నుంచి 1మంది,ఇతర నమోదు చేసిన పార్టీల నుంచి 3మంది స్వతంత్ర అభ్యర్థులుగా 66 మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా శాంతియుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కమిషనర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ రాష్ట్రం నుండి గోగికార్ నరేష్ కు రాష్ట్రీయ ప్రేరణ దూత్ 2025-26 అవార్డ్

**నాంపల్లి,హైదరాబాద్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** వికసిత్ భారత్ నేషనల్ యూత్ సమ్మిట్ ఆధ్వర్యంలో బీహార్ రాష్ట్రములోని చాపర జిల్లాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం నుండి జియాగూడ కేశవస్వామినగర్ ప్రాంతానికి చెందిన గోగికార్ నరేష్ కు 2025-26 రాష్ట్రీయ ప్రేరణ దూత్ అవార్డ్ అందజేయడం జరిగింది. తెలంగాణకు చెందిన గోగికర్ నరేష్ సమాజ అభివృద్ధి,ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించడం ద్వారా ప్రసిద్ధి చెందినాడని నిబద్ధత,సామాజిక అవగాహన ఉన్న వ్యక్తియని సామాజిక బాధ్యత,యువత భాగస్వామ్యం అట్టడుగు స్థాయి సాధికారతను ప్రోత్సహించ డానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని గుర్తించి అవార్డు అందజేయడం జరిగింది.అయన విద్య,అవగాహన,సామూహిక చర్యపై బలమైన నమ్మకంతో,స్థానిక స్థాయిలో సానుకూల మార్పును ప్రోత్సహించే కార్యక్రమాలకు ఆయన




సహకరిస్తారని గోగికర్ నరేష్,తన అంకితభావం నాయకత్వ లక్షణాలు మరియు సేవా ఆధారిత మనస్తత్వానికి గుర్తింపు పొందారు. అర్థవంతమైన నిశ్చితార్థం,నైతిక విలువలు తెలంగాణలో స్థిరమైన మరియు సమగ్ర వృద్ధి కోసం ఒక దృక్పథం ద్వారా సమాజాన్ని ఉద్ధరించడానికి కృషి చేస్తున్నారని గుర్తింపు పొంది అవార్డుకు అర్హత సాధించారు.ఈ సందర్భంగా జియాగూడ కేశవస్వామినగర్ ప్రాంతానికి చెందిన గోగికార్




నరేష్ కు మహాత్మజ్యోతిరావు పూలే యువ మంచ్ తరపున శుభాకాంక్షలు తెలిపారు.

# హాంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు ఎంపికైన సాయిగ్రామర్ హైస్కూల్ విద్యార్థి సుజల్ సింగ్







**ముగ్గురు కలకత్తా,మరో 9మంది బెంగళూరు కేంద్రాలకు ఎంపిక..**

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** హాంకాంగ్ లోని అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు రాజేంద్రనగర్ మైలార్ దేవుపల్లి డివిజన్ పద్మశాలిపురంలోని సాయిగ్రామర్ హైస్కూల్ విద్యార్థి సుజల్ సింగ్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎ.శ్రీలక్ష్మీ తెలిపారు.హైదరాబాద్ నగరంలోని నాలెడ్జ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (క్యాట్ )అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ లో సాయిగ్రామర్ హైస్కూల్ విద్యార్థి టాప్ టెన్ లో మొదటి ర్యాంకు సాధించి హాంకాంగ్ అంతరిక్ష పరిశోధన కేంద్రానికి ఎంపికైనట్లు వివరించారు.దీంతోపాటు టాలెంట్ టెస్ట్ లో మంచి ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులు కె. వీర్,పి.లాస్యశ్రీ,హిమాన్స్ భుయాన్,లు ఢిల్లీ,కలకత్తా లోని జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శనకు,మరో 9మంది బెంగుళూరులోని జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్ర సందర్శనకు ఎంపిక కాగా,మరో 14మంది విద్యార్థులు హైదరాబాదులోని బిర్లా ప్లాంటేరియం సందర్శనకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.ఈ సందర్భంగా వివిధ అంతరిక్ష పరిశోధన కేంద్రాలకు తమ పాఠశాల నుండి ఎంపికైన 27మంది విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ... విద్యార్థులను భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్న క్యాట్ అకాడమి చైర్మన్ డాక్టర్ అన్వర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.క్యాట్ అకాడమీ నిర్వహించే టాలెంట్ టెస్టులో తమ పాఠశాల నుండి ప్రతి సంవత్సరము హాంకాంగ్ కలకత్తా బెంగళూరు అంతరిక్ష పరిశోధన కేంద్రాలకు విద్యార్థులు పెద్ద ఎత్తున ఎంపికైతున్నారని,హాంకాంగ్ అంతరిక్ష కేంద్రానికి గత ఐదు సంవత్సరాలుగా తమ పాఠశాల తరఫున విద్యార్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు తమకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.

# రాయికల్ కాంగ్రెస్ లో అయోమయం





**బీఆర్ఎస్ నాయకులకు టికెట్ ఇవ్వడం ఎంతవరకు సమంజసం.?**
**కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో తిరుగుబాటు..**

**రాయికల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపల్ ఎన్నికల్లో బీ-ఫారాల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు రాజీనామా చేశారు.కాంగ్రెస్ పార్టీ యువజనశాఖ పట్టణ అధ్యక్షుడు బత్తిని నాగరాజు,మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు తాటిపాముల మమత పార్టీకి సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు మంగళవారం రాయికల్ పట్టణం జేఏసీ ప్రెస్ క్లబ్ లో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈ విషయాన్ని వెల్లడించారు.ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మ్యాకల రమేష్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ తరపున నిరంతరం ప్రజాసేవ చేస్తూ, గడపగడపకు వెళ్లి సభ్యత్వాలు నమోదు చేసిన నిజమైన కార్యకర్తలకు కాకుండా..పార్టీలో సభ్యత్వం కూడా లేని వారికి బీ-ఫారాలు కేటాయించడం అత్యంత దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన కాంగ్రెస్ కార్యకర్తలు,సొంత ఖర్చులతో అహర్నిశలు పనిచేసినా వారికి అవకాశం ఇవ్వకపోవడం పార్టీ విధివిధానాలకు విరుద్ధమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు ఇది ఘోరమైన మోసమని అన్నారు.పట్టణంలో కాంగ్రెస్ పార్టీ తరపున బీఆర్ఎస్కు చెందిన మున్సిపల్ మాజీ చైర్మన్ మోర హనుమాన్లు మున్సిపల్ వైస్ చైర్మన్ గాండ్ర రమాదేవి లీడర్లకు బీ-ఫారాలు కేటాయించారని ఆరోపణలు చేశారు.జిల్లాలోని ఇద్దరు పెద్ద నాయకుల మధ్య జరుగుతున్న వర్గపోరాటాల కారణంగా స్థానికంగా పనిచేసిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు.తనకు 2వ వార్డులో బీ-ఫారం కేటాయించినప్పటికీ కార్యకర్తల ఆవేదన,కన్నీళ్లను చూసి తాను పోటీలో నిలబడనని ప్రకటించారు.అనంతరం పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు మాట్లాడుతూ...గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన తమలాంటి వారికి కాకుండా..కాంగ్రెస్ కండువా కూడా లేని వ్యక్తులకు టికెట్లు ఇవ్వడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.తాను 9వ వార్డు నుంచి కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీకి సిద్ధమైనప్పటికీ బీ-ఫారం ఇవ్వకపోవడంతో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు తాటిపాముల మమత మాట్లాడుతూ...పార్టీ కోసం పనిచేసే మహిళా కార్యకర్తలకు గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.తనకు 5వ వార్డులో బీ-ఫారం కేటాయించకపోవడంతో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పూర్తిగా పోయిందని,ఈ ప్రభుత్వాన్ని తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు ఈ విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ పట్టణం అధ్యక్షుడు మేకల రమేష్,పట్టణ యువజన నాయకుడు బత్తిని నాగరాజు,కడకుంట్ల నరేష్, బాపురపు నరసయ్య,బొంగోని భూమగౌడ్ మున్ను బాయ్,మొబిన్ మజీద్,లు పాల్గొన్నారు.

## ఎల్లంపేట మున్సిపాలిటీ 18వార్డులను కైవసం చేసుకుంటాం..

**మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి**



**మేడ్చల్,జనవరి03(సూర్యరేఖ)** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని18 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎల్లంపేట్ మున్సిపల్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం మేడ్చల్ లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ...ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని 24వార్డులలో పూర్తి స్థాయిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బిఫామ్ ఇచ్చి ఎన్నికల బరిలో ఉంచినట్లు తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల వద్దకు తీసుకెళ్లి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో నాలుగు గ్యారెంటీలను ఇప్పటికే అమలు చేయడం జరిగిందని,రానున్న రోజుల్లో మిగిలిన రెండు గ్యారెంటీలను కూడా అందజేస్తామని తెలిపారు.పార్టీ నాయకులందరూ సమిష్టిగా అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉద్దండపురం సత్యనారాయణ,ఓబిసి చైర్మన్ గువ్వ రవి ముదిరాజ్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ దుర్గం శంకర్ ముదిరాజ్,సీనియర్ నాయకులు రామన్నగారి సంతోష్ గౌడ్,మాజీ కౌన్సిలర్ కౌడె మహేష్ కురుమ, మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ భీమేశ్వర ఆలయాన్ని సందర్శించిన తాహసిల్దార్ నాగార్జున,మండల అభివృద్ధి అధికారి బింగి చిరంజీవి



**రాయికల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలోని భీమేశ్వర ఆలయాన్ని తాహసిల్దార్ నాగార్జున,మండల అభివృద్ధి అధికారి బింగి చిరంజీవి,లు భీమేశ్వరుడికి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం తహసిల్దార్ నాగార్జున,మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గిరుదవార్ దాసరి పద్మయ్య,తహసిల్దార్ కార్యాలయం సీనియర్ అకౌంటెంట్ రాజలింగం, ఇతర అధికారులకు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,భక్తులు పాల్గొన్నారు.

## గోపాలకుంట ప్రజలను చూసి చెల్లించి పోయిన లక్కినేని సతీష్


**నేను నాయకుడిని కాదు..మీ సేవకుడిని**





**ఖమ్మం,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు కౌన్సిలర్ గా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ ఆదేశాలతో పోటీ చేస్తున్న నాకు రాజకీయం అక్కర్లేదు..వెనకబడిన ప్రాంతాలను, ప్రజలను,అభివృద్ధి చేయడమే నా ముందున్న లక్ష్యం.. నేను పుట్టిన ఊరికి సేవ చేస్తా అనే ఉద్దేశంతో ఈరోజు గోపాలకుంటలో పోటీ చేస్తున్నానని తెలిపారు.ప్రతి ఇంటిని చూసి,ఆ రోడ్లను చూసి నా హృదయం చెల్లించి పోయింది.ఇప్పుడు పోటీలో ఉన్న నాయకుడు నిన్నటి వరకు సర్పంచి హోదాలో ఉన్నారు.ఆయన గ్రామానికి చేసిన అభివృద్ధి శూన్యం..ప్రజలు వాస్తవలను గ్రహించి నన్ను ఆశీర్వదించాలని కోరారు. మాకు ప్రభుత్వం ఇచ్చే నిధుల అవసరం లేదు..నా వ్యక్తిగతంగా నేను సేవ చేద్దామనే ఉద్దేశంతో 8వ వార్డు కౌన్సిలర్ గా పోటీ చేస్తున్నానని తెలిపారు. మాకు సేవ చేయటం తప్ప మాయమాటలు మాట్లాడటం రాదు. ఎనిమిదో వార్డు సభ్యులు పోటీలో ఉన్న అభ్యర్థులను ఎంచుకొని ఓటు ేయాలని అభ్యర్థించారు.ఈ ఒక్కసారి నాకు అవకాశం ఇవ్వండి..మీకు అభివృద్ధి చేసి చూపిస్తా, అంటూ ప్రచారంలో లక్కినేని సతీష్ దూసుకుపోతున్నాడు. గోపాలకుంట గ్రామ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు పసుమర్తి చందద్రావు తోట సుబ్బారావు,రాజబోయిన శ్రీనివాసరావు,తదితరులు ఉన్నారు.

## అప్పుల బాధ తీర్చలేక మనస్థాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య..



**కొల్చారం,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** అప్పులు తీర్చలేక మనస్థాపంతో ఇంట్లో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన మంగళవారం మండలంలోని పోతం శెట్టిపల్లి చౌరస్తాలో చోటు చేసుకుంది. పోలీసులు ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం. చౌరస్తాకు చెందిన ఎల్లపురం వెంకటేశం (31)చేసిన అప్పులు తీర్చడానికి కుటుంబంతో షాపూర్ నగర్ రెండు ఏళ్ల క్రితం వెళ్లి అక్కడ కూలి పని చేస్తున్నాడు.కాగా గత నేల25న ఇంటికి వెళ్ళివస్తానని భార్యకు చెప్పి పోతం శెట్టిపల్లి చౌరస్తాకు వచ్చాడు. మధ్యంకు బానిసైనా వెంకటేష్ తిరిగి షాపూర్ కు వెళ్ళలేదు. అయితే మధ్యాహ్నం ఇంట్లోనే వాసానికి ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న భార్య పిల్లలు హుటా హుటీనా చేరుకొని మృతునిపై పడి బోరున విలపించారు.మృతుని భార్య ప్రమీల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అహ్మద్ మోహినోద్దీన్ తెలిపారు.

## సేవా సమితి శిక్షణ తరగతులను సద్వినియోగ పరచుకోవాలి..



**మందమర్రి,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సులను సద్వినియోగ పరచుకోవాలని ఏరియా డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్,సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, ఎస్ఓటు జిఎం జివిల్ ప్రసాద్,లు కోరారు. మంగళవారం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో గల యోగా హాల్ లో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్, బ్యూటీషియన్,ఫ్యాషన్ డిజైనింగ్,అలాగే రామక్రిష్ణాపూర్ లో నిర్వహిస్తున్న బ్యాటీషియన్ తరగతులను వారు పరిశీలించారు.ఈ సందర్భంగా వారు శిక్షకులతో మాట్లాడి పలు కోర్సుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ...శిక్షణ తరగతులు ముగించుకున్న ప్రతి ఒక్కరు స్వయం ఉపాధి పొంది,ప్రతి ఒక్కరికి మార్గ దర్శకులు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ మున్సిపాలిటీలో 49మంది అభ్యర్థులు పోటీ..

**రాయికల్ మున్సిపల్ కమిషనర్ కీర్తి నాగరాజు వెల్లడి..**




**రాయికల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** జగిత్యాల జిల్లా రాయికల్ మున్సిపాలిటీలో మొత్తం స్థానాలు 12 ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు మొత్తం 49 మంది పోటీలో ఉన్నారు.పార్టీల వారీగా కాంగ్రెస్ -11,బిజెపి12,జనసేన5,బీఆర్ఎస్12, ఇండిపెండెంట్ -9,1వ వార్డు కైరం రమణ,బీఆర్ఎస్ ఫర్హాన్హాజ్,కాంగ్రెస్ తోపారపు ప్రశాంతి బిజెపి 2వ వార్డు కట్కం రవి,బీఆర్ఎస్ సుంటిగీకర రాము, బిజెపి 3వ వార్డు భూక్యా రాకేష్ నాయక్, కాంగ్రెస్ కన్నాక మహేందర్ బీఆర్ఎస్ కురిసేంగ వేణు బిజెపి చౌహాన్ శ్రీనివాస్, జనసేన 4వ వార్డు తురగ సౌజన్య బీఆర్ఎస్ పుప్పాల వనిత,కాంగ్రెస్ సురతని భాగ్యలక్ష్మి, బిజెపి 5వ వార్డువల్ల కొండ సంధ్య,బీఆర్ఎస్ కునారపు అనూష,బిజెపి సింగని శారద,కాంగ్రెస్ తాటిపముల మమత,స్వతంత్ర కాషావెని హేమలత, జనసేన దువ్వక వాణి,స్వతంత్ర 6వ వార్డు వేముల మౌనిక,బిజెపి తబస్సుం,బీఆర్ఎస్ పిప్పోజి సునీత,కాంగ్రెస్ 7వ వార్డు ఎలిగేటి లతిక,బీఆర్ఎస్ మల్లరాజేశం బిజెపి మోర హన్మండ్లు,కాంగ్రెస్ కోన రాజు,స్వతంత్ర 8వ వార్డు బోదాసు నవీన్,బీఆర్ఎస్ మచ్చ నారాయణ బిజెపి కడకుంట్ల నరేష్,ఇండిపల్లికొండ గంగాధర్,కాంగ్రెస్ మ్యకల జనార్ధన్,జనసేన 9వ వార్డు శ్రీరాముల సువర్ణ,బీఆర్ఎస్ బత్తిని మహేశ్వరి, స్వతంత్ర కైరమ్ అనూష,బిజెపి గంద్ర రమాదేవి,కాంగ్రెస్10 వార్డు మచ్చ గంగలక్ష్మి,కాంగ్రెస్ ఆడెపు ప్రశాంతి బిజెపి పెండెల వనిత,బీఆర్ఎస్ లింగంపల్లి రోజా స్వతంత్ర కొత్తపల్లి లావణ్య,స్వతంత్ర 11వార్డు మారంపల్లి సాయికుమార్,బీఆర్ఎస్ పాలేపు బాలరాజు,జనసేన పాశం నడిపి భూమయ్య,స్వతంత్ర ముక్కెర రాజేంద్ర ప్రసాద్,కాంగ్రెస్ పుర్రె శ్రీధర్,బిజపి 12వ వార్డు మోర ధీరజ్ రామ్మూర్తి కాంగ్రెస్ సిర్ప మణిదీప్,ఇండి కల్లెడ ధర్మపురి బిజెపి గంగాధరి గంగాధర్ స్వతంత్ర ఆడెపు అర్జున్,జనసేన మొత్తం ఎన్నికల బరిలో 49 మంది ఉన్నారని మున్సిపాల్ కమిషనర్ కీర్తి నాగరాజు తెలిపారు.22 మంది నామినేషన్ వాపస్ తీసుకున్నారు.

# కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పీహెచ్డీ పర్యవేక్షకులుగా ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల నియామకం






**జగిత్యా,ఫిబ్రవరి03 (సూర్యరేఖ)** కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు చెందిన 17మంది అధ్యాపకులను పీహెచ్డీ పర్యవేక్షకులుగా నియమిస్తూ శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ఆచార్య ఉమేష్ కుమార్,రిజిస్ట్రార్ ఆచార్య బి.సతీష్ కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ... ఇది శాతవాహన యూనివర్సిటీ చరిత్రలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు పీహెచ్డీ పర్యవేక్షకులుగా నియమించడం మొట్టమొదటిసారి అని,ఈ అవకాశాన్ని అధ్యాపకులు వినియోగించుకుని మంచి నాణ్యమైన పరిశోధనకై పీహెచ్డీ విద్యార్థులకు మార్గదర్శనం చేయాలని కోరారు.రిజిస్ట్రార్ ఆచార్య బి.సతీష్ కుమార్ మాట్లాడుతూ...తెలుగు విభాగం నుండి అయిదుగురు అధ్యాపకులకు కామర్స్ విభాగం నుండి ఏడుగురు అధ్యాపకులకు మరియు వృక్ష శాస్త్ర విభాగం నుండి ఐదుగురు అధ్యాపకులకు పర్యవేక్షకులుగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.పీహెచ్డీ పర్యవేక్షకులుగా ఉత్తర్వులు పొందిన వారిలో తెలుగు విభాగం నుండి ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి డాక్టర్ తత్వాది ప్రమోద్ కుమార్,డాక్టర్ బూర్ల చంద్రశేఖర్,డాక్టర్ శారద కామర్స్ విభాగం నుండి ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి,డాక్టర్ అనంతుల సతీష్ కుమార్ డాక్టర్ లావణ్య,డాక్టర్ ఎం.మల్లారెడ్డి డాక్టర్ హర్జోత్ కౌర్,డాక్టర్ బూర్ల నరేష్,డాక్టర్ కాంపల్లి అర్జున్ వృక్షశాస్త్ర విభాగం నుండి డాక్టర్ తీరుకోవెల శ్రీనివాస్ డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ ఓదేలు డాక్టర్ బాలరాజు,డాక్టర్ పడాల తిరుపతి ఉన్నారు. వీరు త్వరలో శాతవాహన యూనివర్సిటీలో అడ్మిషన్ పొందనున్న పీహెచ్డీ విద్యార్థులకు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటనామస్ కళాశాల పరిశోధన కేంద్రం ద్వారా మార్గదర్శనం చేయనున్నారు.ఈ సందర్భంగా టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ. పూర్వ కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచనలు సలహాలతో కొన్ని సంవత్సరాలుగా సంఘం నిరంతరాయంగా చేస్తున్న కృషి ఫలితంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు పీహెచ్డీ గైడ్ షిప్ వరించిందని,ఇది ఒక అపురూప విజయమని తెలిపారు.మంచి నాణ్యమైన పరిశోధన చేసే విధంగా ఈ మార్గదర్శకులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య బి.సతీష్ కుమార్,ఓఎస్ డీ డాక్టర్ హరికాంత్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ జరీలకు కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపక బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో వైస్ ఛాన్సర్ ఓఎస్డీ డాక్టర్ హరికాంత్,రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ జాఫర్ జరీ,కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ,వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్ టి రాజయ్య, టీజీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి యూనివర్సిటీ సమన్వయకర్త డాక్టర్ కె.మల్లారెడ్డి పరిశోధన కమిటీ సమన్వయకర్త డాక్టర్ ఎం.మల్లారెడ్డి అధ్యాపకులు డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి డాక్టర్ శ్రీనివాసరెడ్డి,డాక్టర్ ఎం.సత్య ప్రకాష్ కీర్తి రాజేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేనుంటానో పోతాను మల్లా నువ్వే రావాలి

**ఇప్పుడు ఉన్నోళ్లు ఏం చేయలే..**
**పేట ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డితో అవ్వ సంభాషణ..**




**నారాయణపేట(ధన్వాడ),ఫిబ్రవరి03(సూర్యరేఖ)** ఇంతవరకు ఎవరు ఏం చేయలే..అంత నువ్వు చేసిందే ఉంది..నేనుంటానో..పోతానో తెలియదు మల్ల నువ్వే రావాలి..నువ్వు చేసిన పనులే ఉన్నాయి అంటూ ఎన్నికల ప్రచారంలో ఓ అవ్వ మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి,తో ముచ్చటించారు. నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు అందులో భాగంగానే ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో ఓ అవ్వ మాజీ ఎమ్మెల్యే తో ముచ్చటిస్తూ ఇక్కడ నువ్వు చేసిన పనులే ఉన్నాయి.ఇప్పుడు ఉన్నోళ్లు ఏం చేయలే..మొర్లు కూడా తీయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు నేనుంటానో...పోతానో అంటూ అవ్వ అన్న మాటలకు మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి స్పందిస్తూ ఎక్కడ పోతావు...నన్ను గెలిపియ్యవా. నిన్ను బతికించుకుంటాం ..నన్ను గెలిపియ్యాలి అంటూ అవ్వతో ముచ్చటించారు.

## పదో తరగతిలో వందశాతం ఫలితాలే లక్ష్యం

**ఉపాధ్యాయులకు డీఈవో విజయ ఆదేశాలు**



**మెదక్,పాపన్నపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తమ ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్థులు పూర్తి శ్రద్ధతో చదవాలని జిల్లా విద్యాధికారిణి (డీఈవో)విజయ స్పష్టం చేశారు.మంగళవారం మండల పరిధిలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేసి విద్యా బోధన తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించి నిరంతర మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు.పరీక్షలకు విద్యార్థులను మానసికంగా విద్యాపరంగా పూర్తి స్థాయిలో సన్నద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ విద్యార్థులు కష్టపడి చదివితే తప్పకుండా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంఈవో ప్రతాప్ రెడ్డి,ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## 21వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిన్నోళ్ల ప్రేమ్ సాగర్**



**మేడ్చల్,జనవరి03(సూర్యరేఖ)**ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని నూతనకల్ 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగిన తనను వార్డు ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా చిన్నోల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ...వార్డు అభివృద్ధికి ఒక్క సారి అవకాశం ఇవ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తాను డబ్బులు సంపాదించుకోవడానికి రాజకీయ లోకి రాలేదని, ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే వచ్చానని తెలిపారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసి గెలిపిస్తే వార్డు అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వార్డు ప్రజలకు ఎల్లవేళలా అందజేయడానికి ముందుంటానని తెలిపారు.దీంతోపాటుగా ఎల్లవేళలా వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు.వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తూ మున్సిపాలిటీ అధికారులతో మాట్లాడుతూ... సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని తెలియజేశారు.అధికారంలో ఉన్న పార్టీకి అండగా ఉంటే వార్డు పరిధిలోని సమస్యల పరిష్కారం సులువుగా జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.వార్డు అభివృద్ధికి ఒక ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతానని హామీ ఇచ్చారు. వార్డు పరిధిలోని యువకులకు స్థానికంగా ఉన్న పరిశ్రమలలో ఉద్యోగాలు వచ్చే విధంగా తనవంతు సహకారం ఉంటుందని అన్నారు.వార్డు పరిధిలోని ఓటర్లందరూ హస్తం గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## బెల్లంపల్లి మున్సిపల్ నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా నిర్వహించాలి..



**బెల్లంపల్లి,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ పకడ్బందీగా నిర్వహించాలంటూ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కుమార్ దీపక్ సూచనలు ఇచ్చారు. మంగళవారం బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల ఉపసంహరణ,అభ్యర్థుల తుది జాబితా తయారీ ప్రక్రియను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్ ఇతర అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... నిబంధనలకు అనుగుణంగా పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తక్షణమే ప్రకటించాలని సూచించారు.

## ప్రజలే నా బలం..ప్రజా సంక్షేమమే నా ధ్యేయం..

**- 20 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వరలక్ష్మి సురేందర్**



**మేడ్చల్,ఫిబ్రవరి03(సూర్యరేఖ) :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం 20 వ వార్డు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలిపించాలని వరలక్ష్మి సురేందర్ వార్డు ప్రజలను కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వార్డు సమస్యలకై నిరంతరం కృషి చేస్తానని,ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో శ్రీరంగవరం 20వ వార్డును అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు.వార్డు అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని,గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో సర్పంచ్ గా గెలిచి గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. మరొకసారి తనకు అవకాశం ఇస్తే ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దుతానని వెల్లడించారు.ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

# రామయంపేటలో కాంగ్రెస్ ప్రచారానికి ప్రజల హృదయాలే వేదిక







## పదవ వార్డులో ఇంటింటా నడిచిన ఆశల యాత్ర.!

**రామయంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** రామయంపేట మున్సిపల్ ఎన్నికల వేళ పదవ వార్డులో కాంగ్రెస్ ప్రచారం కొత్త ఉత్సాహాన్ని పుంజుకుంది.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఎనిశెట్టి శ్రీవాణి అశోక్ గుప్త ఇంటింటా తిరుగుతూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ సాగించిన ప్రచారం,రాజకీయ ప్రచారాన్ని దాటి ప్రజల మనసులను తాకే ఉద్యమంలా మారింది. సాధారణ ప్రజల మధ్యకే వెళ్లి,వారి సమస్యలను వినుతూ,వారి అవసరాలను అర్థం చేసుకుంటూ సాగిన ఈ ప్రచారం వార్డులో ప్రత్యేక చర్చకు దారితీసింది.కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు సూటిగా స్పష్టంగా, అర్థమయ్యే భాషలో వివరించడంతో మహిళలు, యువకులు,పేద వర్గాలు విశేషంగా ఆకర్షితుల య్యారు."పేదల జీవన ప్రమాణాలు మార్చడమే కాంగ్రెస్ లక్ష్యం"అనే నినాదాన్ని కేవలం మాటలకే పరిమితం చేయకుండా,ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను ఉదాహరణలతో వివరించారు. రామయంపేట వంటి పట్టణానికి ఈ పథకాలు ఎంత అవసరమో,అవి ప్రజల దైనందిన జీవితాలను ఎలా మార్చగలవో హృదయానికి హత్తుకునేలా వివరించడంతో ప్రచారానికి మంచి స్పందన లభించింది.ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు,పెద్ద ఎత్తున స్థానిక ప్రజలు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు.ప్రజల మన్ననలు పొందుతూ ముందుకు సాగుతున్న ఈ ప్రచారం పదవ వార్డులో కాంగ్రెస్‌కు బలమైన ఆశాకిరణంగా మారుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# పదవ వార్డులో వికసించిన కమలం







**మహిళల తీర్పుతిరుమల వైపు.!**
**రామయంపేట,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** రామయంపేట మున్సిపల్ ఎన్నికల్లో పదవ వార్డు రాజకీయ చిత్రపటం ఒక్కసారిగా మారిపోయింది. ఇప్పటివరకు కనిపించిన సాధారణ ఎన్నికల పోరు.. ఇప్పుడు మహిళల నిశ్శబ్ద విప్లవంగా రూపాంతరం చెందింది.ఇంటింటా సాగుతున్న బీజేపీ అభ్యర్థి దోమకొండ తిరుమల రాములు ప్రచారం,రాజకీయ హద్దులను దాటి మహిళల హృదయాలను తాకింది. వార్డులోని మహిళలు స్వయంగా ముందుకొచ్చి తిరుమల వెంట నడవడం,ఆయన ప్రచారానికి బ్రహ్మరథం పట్టడం ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా మలిచేస్తోంది. వంటింటి సమస్యల నుంచి వీధుల సమస్యల వరకూడనీటి కొరత నుంచి పారిశుధ్య లోపాల వరకూడఇన్నాళ్లు లోపలే మగ్గిన తమ గళాన్ని ఇప్పుడు మహిళలు బహిరంగంగా వినిపిస్తున్నారు. "మా సమస్యలు చెప్పుకునే వేదిక ఇదే"అన్న ధైర్యంతో తిరుమల రాములు వెంటే అడుగులు వేస్తున్నారు.ఈ క్రమంలో పదవ వార్డులో నిర్వహించిన భారీ ర్యాలీ రాజకీయ ర్యాలీగా కాకుండా మహిళల ఆత్మవిశ్వాస ప్రదర్శనగా నిలిచింది.ముందువరుసలో మహిళలే..వెనుక ఉత్సాహంగా యువత..మధ్యలో మార్పు నినాదాలు..సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా నినాదాల్లో నొసలు చుక్కలుడఅడుగుల్లో ఆత్మవిశ్వాసం చూపుల్లో మార్పు ఆశయం మహిళల ఉత్సాహం ధైర్యం ఐక్యతతో ర్యాలీ ఉగ్రూతలూగింది.

# ఎఫ్ డిపిటి,ఎఫ్ డిఓ వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు

**అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనదారులు వాహనాల పట్టివేత**
**అక్రమంగా ఇసుక రవాణాను అటవీశాఖ అధికారులు అడ్డుకోవద్దని**
**జిల్లా అధికారుల వాహనాలను అడ్డుకున్న అక్రమదారులు**
**మీరు వాహనాలను అడ్డుకున్న నిబంధనల ప్రకారం చట్టపరంగా**
**మా పని మేము చేసుకుంటామని తేల్చి చెప్పిన ఎఫ్ఆర్ఓ**
**సత్యనారాయణ**





**ఆదిలాబాద్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** :మంచిర్యాల జిల్లా జన్నారం మండలం రెండు రోజులుగా మా పత్రికలో ప్రచురితమైన అక్రమ కలప రవాణా,ఈ విషయం పై విచారణ చేపట్టాలని మా పత్రికలో వచ్చిన కథనానికి స్పందించి జిల్లా అధికారులు మంగళవారం జన్నారం మండలానికి వచ్చారు.రెండు రోజుల క్రితం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇద్దరు సిమెంట్ ఇటుక బట్టిల యజమానుల ట్రాక్టర్లను ఇన్ దనపల్లి రేంజ్ అధికారులు పట్టుకొని సీజ్ చేశారు.జిల్లా అధికారులు ఈరోజు వస్తున్నారని తెలుసుకున్న గ్రామస్తులు ఇంధనపల్లి అటవీ శాఖ కార్యాలయం ముందు జిల్లా అధికారుల వాహనాలను అడ్డుకొని ఇసుక రవాణాకు పాల్పడుతున్న యజమానుల ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారని,అది ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేస్తున్నామని చెబుతూ వారు అధికారుల వాహనాలను అడ్డుకున్నారు.ఈ విషయమై ఎఫ్ఆర్ఓ సత్యనారాయణను వివరణ కోరగా ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తీసుకువెళ్లడానికి ఎవరు కూడా అనుమతి తీసుకోలేదని,తాము ఎవరికీ అనుమతి ఇవ్వలేదని అక్రమంగా సిమెంట్ ఇటుక తయారీ కేంద్రాలకు ఇసుకను సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో వాహనాలను సీజ్ చేసామని వారు తెలిపారు.అటవీ అధికారులు పత్రికలోవచ్చిన కథనానికి స్పందించి విచారణకు వస్తే కొంతమంది జిల్లా అధికారుల వాహనాలను అడ్డుకున్నారని మా టైగర్ జోన్ నిబంధనల ప్రకారం అడవి వాగులలో నుండి ఎలాంటి ఇసుక,కలప మట్టి రవాణా చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని,నిబంధనాలను మేము పాటిస్తున్నామని అక్రమాలకు పాల్పడేటటువంటి వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్న ,ఇండ్ల వద్ద ఇసుక కుప్పలను నిలువ చేసిన చట్టపరమైన చర్యలు తప్పవని వారు తెలిపారు.అటవీ శాఖ అధికారులు ఘాటుగా స్పందించడంతో చేసేది ఏమీ లేక అక్రమార్కులు అక్కడి నుండి వెనుదిరిగి వెళ్ళిపోయారు.రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఎవరు తప్పు చేసినా చట్టపరమైనటు వంటి శిక్షలు తప్పవని అటవీ క్షేత్ర అధికారి తెలిపారు.

## బెల్లంపల్లి పుర ఎన్నికల్లో సత్తా చాటుతాం..

**ఎమ్మెల్యే వినోద్**



**బెల్లంపల్లి,ఫిబ్రవరి03(సూర్యరేఖ)**రానున్న బెల్లంపల్లి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ధీమా వ్యక్తం చేశారు.మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులకు ఎమ్మెల్యే వినోద్,డీసీసీ అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి,తో కలిసి బీ-ఫారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బెల్లంపల్లి పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులకు ప్రజల మద్దతు లభిస్తోందని అన్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సారధ్యంలో పార్టీ బలోపేతం..

**నేడు తెలంగాణకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్**
**ఘన స్వాగతం పలుకాలని పిలుపు..**
**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి**



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03(సూర్యరేఖ)** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సారధ్యంలో పార్టీ బలోపేతానికి శ్రమించడం జరుగుతుందని బీజేపీ నాయకులు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్రానికి మొదటిసారి నితిన్ నబిన్ రానున్న సందర్భంగా మంగళవారం కాటేదాన్ లోని అయ్యప్ప ఆలయం సమీపంలో ఒక సన్నాహక సమావేశం నిర్వహించారు.ఆయన ఉదయం 11 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకోనున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలకాలని సమావేశంలో నిర్ణయించారు. గగన్‌పహాడ్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి,బీజేపీ శక్తిని,ఐక్యతను ప్రజలకు చాటాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కడ్డం సుధాకర్,జోగు రవికుమార్,రావుల భాస్కర్,అడికె మహేందర్,బొమ్మ రాజు నర్సింహ,వెంకట్ రమణ గుప్తా ఎన్.మురళీధర్ రెడ్డి,జి.శ్రావణ్ గుదురు అంజి,బల్లా శ్రీనివాస్ యాదవ్ వై.ప్రభాకర్,కొండల రాజేష్ అరుణ్ సాయి తేజ,సాయి కుమార్ సురేష్ యాదవ్,అంకిత్,పలువురు బీజేపీ నాయకులు,కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ అధ్యక్షునికి ఘన స్వాగతం..

**పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలి..**
**రంగారెడ్డి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు ఆడికే మహేందర్**



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి03 (సూర్యరేఖ)**భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్ నూతనంగా ఎన్నికైన తర్వాత మొదటి సారిగా తెలంగాణకు విచ్చేస్తున్న నేపథ్యంలో బుధవారం రాజేంద్రనగర్ లో ఏర్పాటుచేసే సమావేశానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని స్వాగతం పలుకాలని రంగారెడ్డి జిల్లా బిజెపి సీనియర్ నాయకులు ఆడికే మహేందర్ పిలుపునిచ్చారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ..పార్టీ నాయకులు,కార్యకర్తలు ఉదయం 10 గంటలలోపే గగన్ పహాడ్ వద్ద కలిసి బైక్ ర్యాలీగా శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోవాలన్నారు. అనంతరం ఆయనకు ఘన స్వాగతం పలుకాలని,ఈ మేరకు పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు.

## పెళ్లి కావడం లేదని ఆత్మహత్య

**హైదరాబాద్ :** తల్లిపై ఉన్న ప్రేమ, బాధ్యత ఒకవైపు.. తన వివాహం కావడం లేదనే వేదన మరోవైపు.. ఆ యువతిని తీవ్రమైన ఒత్తిడికి గురిచేశాయి. తల్లికున్న వైకల్యం కారణంగా తన వివాహం జరగడం లేదని భావించిన ఓ యువతి మనస్తాపానికి లోనై ప్రాణాలు తీసుకుంది. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.మేడ్చల్ జిల్లా కండ్లకోయకు చెందిన తోష్నివాల్ విజయలక్ష్మి అనే 26 ఏళ్ల యువతి ఒక ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తోంది. ఆమెకు చిన్నతనంలోనే తండ్రి చనిపోయారు. మరోవైపు మతిస్థిమితం లేని తల్లి సరస్వతి బాధ్యతలు విజయలక్ష్మి చూసుకునేది. వీరు కూకట్‌పల్లి పరిధిలోని మైత్రినగర్‌లో నివాసం ఉంటున్నారు.ఐటీ ఉద్యోగిని విజయలక్ష్మికి ఇటీవల పెళ్లి సంబంధాలు వచ్చాయి. అయితే, తన తల్లి పరిస్థితినిని వివరించడంతో పాటు, ఎవరూ ఆమెను చూసుకునేవారు లేరని, పెళ్లి తర్వాత కూడా తనతోనే ఉంటుందని పెళ్లి సంబంధాల సమయంలో చెప్పేది. అయితే, ఆమె తల్లి కూడా తమ వద్దే ఉండటానికి ఎవరూ ఒప్పుకోలేదు. దాంతో పెళ్లి సంబంధాలు రద్దు అవుతూ వస్తున్నాయి. తల్లి అనారోగ్యం కారణంగా తనకు పెళ్లి సంబంధాలు కుదరకపోవడం, తనకు వివాహం కావడం లేదని ఆమె మనోవేదనకు గురైంది. తల్లికి అన్నీ తానై సేవలు చేస్తున్నప్పటికీ, తన భవిష్యత్తు గురించి ఆలోచించి కుంగిపోయింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లింది, కానీ ఎంతకీ తిరిగి రాలేదు.



## టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ జోరు..
## పార్ట్ 2, పార్ట్ 3లతో రాబోతున్న భారీ సినిమాలు!

ఒకప్పుడు సినిమా అంటే ఒక పార్ట్‌తో ముగిసిపోయే కథ. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తెలుగు ప్రేక్షకులు ఎక్కువగా వినని "సీక్వెల్" అనే పదం ఇప్పుడు ఇండస్ట్రీలో అత్యంత వినిపిస్తున్న మాటగా మారింది. ఒక హిట్ సినిమా వస్తేడ దానికి రెండో భాగం, మూడో భాగం తీసే ట్రెండ్ వేగంగా పెరుగుతోంది. దర్శకులు, హీరోలు, నిర్మాతలు అందరూ ఇప్పుడు సీక్వెల్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. ప్రేక్షకుల్లోనూ అదే ఆసక్తి కనిపిస్తుండటంతో ఇది ఇండస్ట్రీలో ఓ కొత్త ట్రెండ్‌గా మారింది. ఫ్యామిలీ ఎమోషన్‌తో కూడిన క్రైమ్ థ్రిల్లర్‌గా 'దృశ్యం' సిరీస్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. వెంకటేష్ నటించిన 'దృశ్యం', 'దృశ్యం 2' రెండూ సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు 'దృశ్యం 3' కోసం సిద్ధమవుతున్నారు. మలయాళ వెర్షన్ ఇప్పటికే పూర్తయి విడుదలకు రెడీగా ఉండగా, హిందీ వెర్షన్ షూటింగ్ దశలో ఉంది. రెండో భాగం ముగిసిన దగ్గర నుంచే మూడో భాగం ప్రారంభమవుతుందని సమాచారం. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఈ ఏడాది రెండు భారీ సీక్వెల్స్‌తో రానున్నాడనే టాక్ గట్టిగా వినిపిస్తోంది. అవే 'కల్కి 2', 'సలార్ 2'. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్స్‌లో బిజీగా ఉన్న ప్రభాస్‌డ వాటి తర్వాత 'కల్కి 2'ను మొదలు పెట్టి, ఆపై 'సలార్ 2'పై దృష్టి పెట్టనున్నాడని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ నీల్ ఇతర ప్రాజెక్టులు పూర్తి చేసిన తర్వాతే 'సలార్ 2' పట్టాలెక్కే అవకాశం ఉంది.ఎన్టీఆర్ కొరటాల శివ కాంబినేషన్‌లో వచ్చిన 'దేవర'కు సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'దేవర 2' స్క్రిప్ట్ పనులు ఇప్పటికే కొనసాగుతున్నాయని, త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముందని సమాచారం. యంగ్ హీరో తేజ సజ్జ కూడా సీక్వెల్స్ రేసులో ముందంజలో ఉన్నాడు. 'జాంబిరెడ్డి 2', 'జై హనుమాన్', 'మిరాయ్ 2' చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. 'జై హనుమాన్'లో కన్నడ స్టార్ రిషబ్ శెట్టి కీలక పాత్ర పోషించనున్నాడనే వార్త సినిమాపై మరింత హైప్ తీసుకొచ్చింది. చిన్న సినిమాల సీక్వెల్స్ కూడా రేసులో ఉన్నాయి. 'ఈ నగరానికి ఏమైంది' సీక్వెల్ 'జుచీజు రిపీట్' పేరుతో రాబోతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వచ్చిన 'మ్యాడ్' సిరీస్ ఇప్పటికే రెండు భాగాలతో విజయం సాధించగా, ఇప్పుడు 'మ్యాడ్ జూనియర్స్' రూపొందుతోంది. హారర్ థ్రిల్లర్ 'పొలిమేర 3'ను పాన్ ఇండియా స్థాయిలో తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి మాత్రమే కాకుండా 'పుష్ప 3', 'కార్తికేయ 3', 'టిల్లు క్యూబ్', 'కేజీఎఫ్ 3' వంటి ప్రాజెక్టులు కూడా భవిష్యత్తులో రాబోతున్నాయి. వీటిపై అధికారిక ప్రకటనలు ఆలస్యమవుతున్నాడ ప్రేక్షకుల్లో మాత్రం భారీ ఆసక్తి ఉంది. మొదటి భాగం విజయాన్ని కొనసాగించడం సీక్వెల్‌లకు పెద్ద సవాలే. కథ, ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటేనే ప్రేక్షకులను ఆకట్టుకోవచ్చు. అయితే ట్రేడ్ వర్గాల అభిప్రాయం ప్రకారండ రాబోయే సీక్వెల్స్ కూడా విజయవంతమైతే టాలీవుడ్‌లో ఈ ట్రెండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశముంది.

## ధనుష్ కొత్త సినిమాలో ఇద్దరు హీరోయిన్లు



తమిళ ఇండస్ట్రీలో సీనియర్ హీరోగా గుర్తింపు ఉన్న ధనుష్, వరుస సినిమాలతో దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. మంచి కాన్సెప్ట్‌తో ఎప్పుడు ప్రేక్షకులను అలరించే హీరో ధనుష్, ప్రస్తుతం రాజ్ కుమార్ పెరియా సామి దర్శకత్వంలో కొత్త సినిమా చేస్తున్నారు. ఈ సినిమాకు ఇంకా టైటిల్ ఫైనల్ కాలేదు. ఆ 55 అనే వర్కింగ్ టైటిల్ తో ఈ సినిమా తెరకెక్కుతోంది. అమరన్ లాంటి సినిమాతో సక్సెస్ అందుకున్న రాజ్ కుమార్, ధనుష్ కోసం అద్భుతమైన కథ సిద్ధం చేశాడట. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్ అని ఇప్పటికే ప్రకటించారు. పోస్టర్ రిలీజ్ చేసింది చిత్రం బృందం. అటు మమ్ముట్టి స్పెషల్ రోల్ చేయబోతున్నారట.తమిళ హీరో ధనుష్, శ్రీ లీల కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాలో మరో హీరోయిన్ కూడా ఉన్నట్లు తాజాగా ప్రకటించింది చిత్ర బృందం. సాయి పల్లవిని కూడా ఈ ప్రాజెక్టులో ఇన్వాల్వ్ చేస్తున్నారు. అంటే ఈ మూవీలో ఇద్దరు హీరోయిన్లతో హీరో ధనుష్ స్టెప్పులు వేయనున్నాడు. అయితే ఇందులో సాయి పల్లవి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుందని టాక్ నడుస్తోంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఆమెను చూస్తారట. అందుకే సాయి పల్లవిని ఆ పాత్ర కోసం మాత్రమే దర్శకుడు రాజ్ కుమార్ తీసుకున్నట్లు చెబుతున్నారు. అయితే ఇందులో మెయిన్ హీరోయిన్ సాయి పల్లవి ఉంటుందా? లేక శ్రీలీల ఉంటుందా? అనేది తెలియాల్సి ఉంది. కాగా ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీత స్వరాలు అందిస్తున్నారు. 2027లో ఈ సినిమా రిలీజ్ అయ్యే ఛాన్స్ లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇది ఇలా ఉండగా, ఉండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ ఆధ్వర్యంలో వస్తోంది.

## ఊహించలేనన్ని ట్విస్టులతో..




చంద్రహాస్ హీరోగా సంపత్ రుద్ర తెరకెక్కించిన చిత్రం 'బరాబర్ ప్రేమిస్తా'. కాకర్ల సత్యనారాయణ సమర్పణలో సిసి క్రియేషన్స్, ఎవిఆర్ మూవీ వండర్స్ బ్యానర్లపై గెడా చందు, గాయత్రి చిన్ని, ఎవిఆర్ ఈ మూవీని నిర్మిస్తున్నారు. మిస్ ఇండియా ఫైనలిస్ట్ మేఘన ముఖర్జీ హీరోయిన్‌గా నటించారు. అర్జున్ మహీ ("ఇష్టంగా" ఫేమ్) ప్రతినాయకుడిగా కనిపించనున్నారు. ఈ మూవీని ఈ నెల6న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు జయంత్ సి పరాన్జీ, జేడీ చక్రవర్తి, ఆది సాయి కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హీరో చంద్రహాస్ మాట్లాడుతూ,'ధృవన్ చాలా టాలెంటెడ్. ఈ చిత్రం కోసం అద్భుతమైన పాటల్ని అందించాడు. ఈ సినిమాని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించిన చిన్ని, చందు, వెంకీకి, ఈ ప్రాజెక్ట్ నాకు రావడానికి కారణమైన కెమెరామెన్ శేఖర్‌కి థ్యాంక్స్. ఈ సినిమా ఒక్క సెకన్ కూడా బోర్ కొట్టకుండా ఉంటుంది. లెక్కపెట్టలేనన్ని, ఊహించలేనన్ని ట్విస్ట్‌లతో అద్భుతంగా ఉంటుంది. ప్రారంభం నుంచి చివరి వరకు అలా కూర్చుని చూస్తుండిపోతారు. సంపత్ ఈ మూవీని గొప్పగా తీశారు. నన్ను బాగా చూపించారు' అని అన్నారు. 'ఈ సినిమాతో చంద్రహాస్‌కు మంచి బ్రేక్ రావాలని కోరుకుంటున్నాను. ఈ మూవీని చూసి సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని ఆది సాయి కుమార్ అన్నారు. జయంత్ సి పరాన్జీ మాట్లాడుతూ,'ఈ టైటిల్‌లోనే యాటిట్యూడ్, కాన్ఫిడెన్స్, పొగరు ఉంది. ఈ చిత్రం పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది' అని చెప్పారు. సంపత్ రుద్ర మాట్లాడుతూ, 'నిర్మాత వెంకీ నా క్లాస్ మేట్. అతను లేకపోతే ఈ చిత్రం లేదు. చందు, చిన్ని తరువాత ఈ ప్రాజెక్టులోకి వచ్చారు. తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో ఇప్పటి వరకు ఇలాంటి ఓ కమర్షియల్ చిత్రం రాలేదు. క్లైమాక్స్ చూసి అందరూ షాక్ అవుతారు. ఆ షాక్ నుంచే థియేటర్ నుంచి బయటకు వస్తారు' అని తెలిపారు. 'నాకు బుజ్జి లాంటి మంచి పాత్రను ఇచ్చిన సంపత్‌కి థ్యాంక్స్. చంద్రహాస్‌తో పని చేయడం ఆనందంగా ఉంది. ధృవన్ మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది' అని మేఘన ముఖర్జీ చెప్పారు.

## మా పాత్రలు నవ్విస్తాయి, ఏడిపిస్తాయి



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తున్న 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా నుంచి ట్రైలర్ రానే వచ్చింది. హగ్గులు, ముద్దులతో ఫుల్ రొమాంటిక్‌గా సాగిన ఈ ట్రైలర్ ప్రజెంట్ నెట్టింట సందడి చేస్తుంది. ఇక ఈ ట్రైలర్ ఈవెంట్‌లో హీరో సంతోష్ శోభన్ మాట్లాడుతూ.. 'యూవీ క్రియేషన్స్ నా ఫ్యామిలీ లాంటిది. ఈ బ్యానర్ లో వచ్చే ప్రతి సినిమా మాది అనుకుంటాం. డైరెక్టర్ అశ్విన్ చంద్రశేఖర్ చేయబోయే ఎన్నో మంచి చిత్రాల్లో మొదటిదిగా "కపుల్ ఫ్రెండ్లీ" రిలీజ్ కు వస్తోంది. నేను చిన్న గ్యాప్ తీసుకున్న మాట నిజమే. ఈ సారి నేను చూపించబోయే కథ ఇరవై ఏళ్ల పాటు మీకు గుర్తుండిపోవాలి అనుకుని ఈ సినిమా చేశాను. శివ అనే క్యారెక్టర్‌కు ఒక జర్నీ ఉంటుంది. ఆ జర్నీలో మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తా. శివ నెల్లూరు నుంచి వచ్చిన అబ్బాయి, మిత్ర చిత్తూరు నుంచి వస్తుంది. వాళ్లు చెన్నైలో కలుస్తారు. చెన్నైలో షూటింగ్ చేయడం బ్యూటిఫుల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. శివ, మిత్ర అనే పాత్రలు మిమ్మల్ని నవ్విస్తాయి, కదిలిస్తాయి. కాస్త ఏడిపిస్తాయి. "కపుల్ ఫ్రెండ్లీ" ఒక జెన్యూన్ ఇంటెన్షన్‌తో హానెస్ట్ గా చేసిన సినిమా. ఇది నా కెరీర్‌లో గుర్తుండిపోయే మూవీ అవుతుంది' అన్నారు. ఈ చిత్రంలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్‌గా నిర్మిస్తుండగా.. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది.

## 'ధురంధర్ 2' ఎఫెక్ట్.. వాయిదా దిశగా అడివి శేష్ 'డెకాయిట్'?




టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ'. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రం తాజాగా వాయిదా పడనుందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే అదే సమయంలో బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'తో పాటు కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీ నెలకొంది. ఈ భారీ చిత్రాల మధ్య థియేటర్ల లభ్యత, కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో 'డెకాయిట్' చిత్రాన్ని ఏప్రిల్ 10, 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ బాక్సాఫీస్ క్లాష్ గురించి అడివి శేష్ స్పందిస్తూ తమ సినిమా పెద్ద చేపల మధ్య ఒక 'గోల్డ్ ఫిష్' లాంటిదని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సోలో రిలీజ్ కోసం వెతకడమే శ్రేయస్కరమని టీమ్ భావిస్తోంది. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీపై అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,